PRGI Reg No -"APTEL/26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....
శుభోదయ
ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 133, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శుక్రవారం - 03 - జూలై - 2026 , వెల రూ.5/-



## శ్రీవారి సేవలో మంత్రి లోకేశ్.. ప్రత్యేక పూజలు

- టీటీడీ చైర్మన్, ఈవోలు ఆలయ మర్యాదలతో స్వాగతం
- తిరుప్పావడ సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు
- పండితుల ఆశీర్వచనం, తీర్థప్రసాదాల అందజేత

అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

### ప్రభుత్వ విజయాలపై జూలై 15 నుంచి
# ఇంటింటి ప్రచారం చేయాలి
### 'తల్లికి వందనం' రెండో విడత తేదీలు ఖరారు..

- ★ జూలై 16 నుంచి 18 మధ్య తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్న మంత్రి లోకేశ్
- ★ 150 రోజుల్లో 16,000 టీచర్, 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేశాం
- ★ ఈ ఏడాది మరో 10,000 పోస్టులతో మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం



అమరావతి: 'తల్లికి వందనం' పథకం రెండో విడత నిధులను జూలై 16 నుంచి 18వ తేదీల మధ్య తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లు (పీటీఎం) నిర్వహించే సమయంలోనే ఈ నిధులను విడుదల చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రేణిగుంట మండలంలో మిగతా 2 లో

### రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో
## 'పీఎం/సీఎం తొలగింపు' బిల్లు?
పీఎం, సీఎంల పదవులపై 130వ రాజ్యాంగ సవరణ బిల్లు వచ్చే అవకాశం



- 30 రోజులకు పైగా అరెస్టులో ఉంటే పదవి రద్దు చేయాలని ప్రతిపాదన
- జేపీసీ నివేదిక తర్వాత వర్షాకాల సమావేశాల్లో బిల్లు వచ్చే అవకాశం




### కుప్పంలో జూలై 3-5 వరకు మూడు రోజులు
## పర్యటించనున్న ముఖ్యమంత్రి

- అభివృద్ధి సహా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.3847 కోట్ల విలువైన పెట్టుబడులకు శంకుస్థాపనలు చేయనున్న ముఖ్యమంత్రి
- ముఖ్యమంత్రి సమక్షంలో రూ.1026 కోట్ల విలువైన పెట్టుబడులకు ఎంఓయూలు
- ఎంఎస్ఎంఈ పార్క్, కడా గెస్ట్ హౌస్ ప్రారంభం
- కుప్పం బస్టాండ్, డిపో నిర్మాణానికి శంకుస్థాపన చేయనునన్న ముఖ్యమంత్రి

అమరావతి: ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ఒప్పందాలు,

# హైదరాబాద్‌లో పైలట్ ప్రాజెక్టు అమలు
### ఏఐతో ట్రాఫిక్ నిర్వహణ

- ★ ట్రాఫిక్ రద్దీకి, వాతావరణ మార్పులకు అనుగుణంగా సిగ్నళ్లు పనిచేసే విధానాన్ని తీసుకురావాలి
- ★ నగర సమస్యల సత్వర పరిష్కారానికి దోహదపడే సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై చర్చించారు
- ★ సీఎం సమక్షంలో అనలాగ్ ఏఐ, మేఘా ఇంజనీరింగ్ మధ్య ఎంఓయూ



హైదరాబాద్: దేశంలోనే తొలిసారిగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఫిజికల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించేందుకు వీలుగా హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్, దుబాయ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే అనలాగ్ ఏఐ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. పైలట్ ప్రాజెక్టు కింద హైదరాబాద్‌లో ఫిజికల్ ఇంటెలిజెన్స్ ద్వారా ట్రాఫిక్ నిర్వహణ చేపట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నాయి. ఎంసీఆర్‌హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన మిగతా 2 లో



### గురుకులాల అవినీతి, రాష్ట్ర అప్పులపై చర్చకు మంత్రులు సవాల్

- తెలంగాణ భవన్ వద్ద హైటెన్షన్.. పోలీసుల అదుపులో హరీశ్ రావు
- గన్‌పార్క్‌కు వెళ్తుండగా తెలంగాణ భవన్ వద్ద హరీశ్‌రావును అడ్డుకున్న పోలీసులు
- బీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్తత
- కారు దిగి నడుచుకుంటూ వెళ్లే ప్రయత్నం చేసిన హరీశ్‌రావును అదుపులోకి తీసుకున్న పోలీసులు
- చర్చ నుంచి పారిపోవద్దని మంత్రులకు హరీశ్‌రావు



### ఒక అమాయకుడి కుటుంబాన్ని
## చిన్నాభిన్నం చేశారు: వైఎస్ జగన్

- వ్యవహారంలో బాధ్యులైన పోలీసులనే రక్షించే ప్రయత్నాలు సాగుతున్నాయి
- క్రాంతి కుమార్‌పై ఏ కేసులు లేవు. కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు
- మూడు నెలలుగా పోలీసులు వేధిస్తున్నారని క్రాంతి తన వీడియోలో చెప్పాడు
- క్రాంతి కుటుంబానికి న్యాయపరంగా సహాయం చేస్తాం. ఆ కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటాం

### భారత్-పాక్ మధ్య చర్చలు జరపండి..
### ఇరు దేశాల ప్రధానులకు 117 మంది ప్రముఖుల లేఖ



- భారత్-పాకిస్థాన్ మధ్య చర్చలు ప్రారంభించాలని ప్రముఖుల ఉమ్మడి లేఖ
- ఇరు దేశాల ప్రధానులు మోదీ, షెహబాజ్‌కు 117 మంది ప్రముఖుల విజ్ఞప్తి
- ఉగ్రవాదం వంటి అంశాలపైనా చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని సూచన

### బీర్ఎస్ నేతలవి పచ్చి అబద్ధాలు: పొన్నం ప్రభాకర్
## మేం కూడా చర్చకు సిద్ధం: హరీశ్‌రావు
### " మీరు చేసిన వ్యాఖ్యలు నిజమైతే చర్చకు రావాలి



మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ అప్పుల గురించి చర్చకు సిద్ధంగా ఉన్నట్లు బీఆర్ఎస్ నేతలు వెల్లడి

హైదరాబాద్: సవాళ్లు, ప్రతి సవాళ్లతో రాజధాని హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. గురుకులాల్లో అవినీతి మిగతా 2 లో

### రూ.3,200 కోట్ల పెట్టుబడులు
# వేగవంతం చేయాలి
### ఏపీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్
### హీరో కొత్త సెంటర్‌కు చంద్రబాబు శంకుస్థాపన

- శ్రీసిటీలో హీరో గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0కి శంకుస్థాపన
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బదులు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామన్న వ్యాఖ్య
- అమరావతిలో క్వాంటం కంప్యూటర్, కడపలో స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తామని ప్రకటన
- సంపద సృష్టిస్తూ పేదలకు ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యం



అమరావతి: శ్రీసిటీలోని హీరో మోటోకార్ప్ తయారీ కేంద్రంలో గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0 నిర్మాణానికి మిగతా 2 లో

### 37 ఏళ్ల తర్వాత కొత్త ఎయిర్ ఫోర్స్ వన్...



### తొలిసారి ప్రయాణించిన ట్రంప్

- నార్త్ డకోటాలో థియోడర్ రూజ్‌వెల్ట్ లైబ్రరీ ప్రారంభోత్సవంలో ట్రంప్
- లైబ్రరీకి $750,000 ఫెడరల్ గ్రాంటు ప్రకటించిన ట్రంప్
- వైట్‌హౌస్ నుంచి రూజ్‌వెల్ట్ మెడల్ ఆఫ్ ఆనర్ లైబ్రరీకి తరలింపు

### తమిళనాడులో గోవధపై హైకోర్టు నిషేధాన్ని
## సుప్రీంలో సవాల్ చేసిన విజయ్ ప్రభుత్వం

### హైకోర్టు తీర్పు 1958 జంతు సంరక్షణ చట్టానికి
### విరుద్ధంగా ఉందని ప్రభుత్వ వాదన

- ఈ తీర్పు మతస్వేచ్ఛను హరిస్తోందని ప్రతిపక్షాలు, ముస్లిం సంఘాల ఆందోళన
- బక్రీద్, హిందూ పండుగల్లో జంతుబలులపై ప్రభావం చూపుతున్న తీర్పు
- సుప్రీంను ఆశ్రయించడంలో జాప్యంపై టీవీకే ప్రభుత్వంపై విపక్షాల విమర్శలు

తమిళనాడు: తమిళనాడులో గోవధపై మద్రాస్ హైకోర్టు విధించిన సంపూర్ణ నిషేధాన్ని సవాల్ చేస్తూ, నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తీర్పు రాష్ట్రంలో అమలులో ఉన్న చట్టాలకు విరుద్ధంగా మిగతా 2 లో



## రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో
# 'పీఎం/సీఎం తొలగింపు' బిల్లు?

ఢిల్లీ: ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల పదవులకు సంబంధించి కీలక రాజ్యాంగ సవరణకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. 130వ రాజ్యాంగ సవరణ బిల్లును రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. అవినీతి వంటి తీవ్రమైన కేసుల్లో ప్రధాని లేదా సీఎం అరెస్టై 30 రోజులకు పైగా జైలులో ఉంటే వారి పదవిని రద్దు చేయాలన్నదే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. గతేడాది ప్రవేశపెట్టిన ఈ బిల్లును ప్రతిపక్షాల డిమాండ్ మేరకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపారు. జేపీసీ నివేదిక సమర్పించిన తర్వాత ప్రభుత్వం దీనిపై ముందుకు వెళ్లే అవకాశముందని సమాచారం. ఈ బిల్లు రాజ్యాంగ సవరణకు సంబంధించినది కావడంతో ప్రత్యేక మెజారిటీ అవసరం. లోక్‌సభ, రాజ్యసభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది మద్దతు తెలపాలి. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 నిబంధనలను కూడా పాటించాల్సి ఉంటుంది. గతంలో ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దేశ అత్యున్నత ప్రజాప్రతినిధుల పదవులకు సంబంధించిన అంశం కావడంతో మరింత పరిశీలన అవసరమని అప్పట్లో వాదించాయి. గతేడాదితో పోలిస్తే పార్లమెంట్‌లో ఎన్డీయే బలం పెరిగింది. అయినప్పటికీ రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడొంతుల మెజారిటీ మాత్రం ఇంకా లేదు. అందుకే బీజేడీ, వైఎస్సార్‌సీపీ వంటి ప్రాంతీయ పార్టీల మద్దతు కీలకంగా మారే అవకాశం ఉంది. ఈ బిల్లుకు అవి మద్దతు ఇస్తాయా లేదా అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వాటి నిర్ణయంపైనే బిల్లు భవితవ్యం ఆధారపడే అవకాశముంది.

# శ్రీవారి సేవలో మంత్రి లోకేశ్.. ప్రత్యేక పూజలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి చేరుకున్న ఆయనకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి లోకేశ్ తిరుప్పావడ సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, తిరుపతి జిల్లా టీడీపీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో జూలై 3-5 వరకు మూడు రోజులు
# పర్యటించనున్న ముఖ్యమంత్రి

అమరావతి: ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ఒప్పందాలు, పార్టీ కార్యక్రమాలు మరియు క్షేత్రస్థాయి పర్యటనలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు రోజుల పర్యటన షెడ్యూల్ ఖరారైంది. జూలై 3 నుండి 5వ తేదీ వరకు ఆయన తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభంతో పాటు, పార్టీ సంస్థాగత కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొంటారు. అటు అధికారిక విధులు, ఇటు పార్టీ బలోపేతానికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి పర్యటన సాగనుంది. పర్యటనలో భాగంగా తొలిరోజు గుడిపల్లె మండలం పొగురుపల్లెలో ముఖ్యమంత్రి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. సుమారు రూ. 3,847 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు కానున్న 12 పరిశ్రమలకు ఆయన శంకుస్థాపన చేస్తారు. ఈ పరిశ్రమల ద్వారా దాదాపు 23 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. అలాగే, మరో రూ. 1,026 కోట్ల పెట్టుబడులకు సంబంధించి పలు కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రి సమక్షంలో అధికారులతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. వీటితో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా మరికొన్ని అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. అబీస్ ప్రోటీన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం 200 మంది యువతకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల కోసం మంజూరు చేసిన రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్లను ఆయన ప్రారంభించనున్నారు. అదేవిధంగా, పీఎంఏవై పథకం కింద నిర్మించిన 5,179 గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. కుప్పం ప్రాంతంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుపై పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమవుతారు. చివరగా, పొగురుపల్లెలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

## గురుకులాల అవినీతి, రాష్ట్ర అప్పులపై చర్చకు మంత్రులు సవాల్

హైదరాబాద్: గురుకులాల్లో అవినీతి, రాష్ట్ర అప్పుల అంశాలపై చర్చించేందుకు గన్‌పార్క్‌కు బయల్దేరిన బీఆర్ఎస్ నేత హరీశ్‌రావును తెలంగాణ భవన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేదని ముందుకు వెళ్లనివ్వలేదు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చర్చకు వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. వాహనాన్ని నిలిపివేయడంతో హరీశ్‌రావు కాలినడకన గన్‌పార్క్‌కు వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఈ తొక్కిసలాటలో హరీశ్‌రావు కిందపడిపోయారు. అనంతరం పోలీసులు ఆయన్ను, పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. తమ నేతను అడ్డుకోవడంపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. గురుకులాల్లో అవినీతి, రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు రావాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్.. బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్‌లకు సవాల్ విసిరారు. గన్‌పార్క్ వద్ద తాము సిద్ధంగా ఉంటామని ప్రకటించారు. దీన్ని స్వీకరించిన హరీశ్‌రావు, తామే అక్కడికి వస్తున్నామని చెప్పారు. చర్చ నుంచి పారిపోవద్దని మంత్రులకు సవాల్ విసురుతూ తమ వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే అనుమతి లేకపోవడంతో పోలీసులు ఆయన్ను గన్‌పార్క్‌కు వెళ్లనీయకుండా అదుపులోకి తీసుకున్నారు.

## ఒక అమాయకుడి కుటుంబాన్ని
# చిన్నాభిన్నం చేశారు: వైఎస్ జగన్

విజయవాడ: ఒక అమాయకుడ్ని అకారణంగా పోలీసులు హింసించారని, అది తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడితే కనీసం పట్టించుకునే స్థితిలో చంద్రబాబు లేరని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పైగా ఈ వ్యవహారంలో బాధ్యులైన పోలీసులనే రక్షించే ప్రయత్నాలు సాగుతున్నాయని మండిపడ్డారాయన. విజయవాడలోని పేరుపోగు క్రాంతి కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం.. ఆయన మీడియాతో మాట్లాడారు. క్రాంతి కుమార్‌పై ఏ కేసులు లేవు. కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయినా పోలీసులు అతన్ని ఎందుకు పోలీస్ స్టేషన్‌కు పిలిచారు? ఎందుకు హింసించారు?. సీఐ నాగరాజు తనను వేధిస్తున్నాడంటూ.. అది తట్టుకోలేక పోతున్నానంటూ వీడియో తీసుకుని మరీ క్రాంతి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని కుటుంబాన్ని పోలీసులే చిన్నాభిన్నం చేశారు అని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా పోలీసులు వేధిస్తున్నారని క్రాంతి తన వీడియోలో చెప్పాడు. ఆ మరణ వాంగ్మూలం ఆధారంగా కేసు పెట్టాలని.. కానీ ఎందుకు అలా చేయలేదని పోలీసులను ప్రశ్నించారు. కనీసం క్రాంతి కుటుంబం ఫిర్యాదు చేస్తే కేసు పెట్టలేదు. క్రాంతి కుటుంబానికి న్యాయపరంగా సహాయం చేస్తాం. ఆ కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటాం అని వైఎస్ జగన్ ప్రకటించారు.

నెల వ్యవధిలోనే.. విజయవాడ నడిబొడ్డులోనే రెండు దారుణ ఘటనలు జరిగాయి. నెల వ్యవధిలో ఓ లాకప్‌డెత్(గాదె సాయికృష్ణ కేసు), పోలీసుల వేధింపులు తట్టుకోలేక మరొకరు మరణించారు(క్రాంతి కేసును ఉద్దేశించి..). సాయికృష్ణ కేసులో అతని తల్లి అర్జీని కూడా పోలీసులు పట్టించుకోని పరిస్థితి. ఏకంగా సీసీటీవీ ఫుటేజీనే మాయం చేశారు. సీసీ టీవీ ఫుటేజీ మాయమైపోతే బ్యాకప్ ఉండదా?. పద్ధతి ప్రకారమే స్టేషన్‌లో అరాచకాలు చేస్తున్నారు. సీఐని సీపీ, సీపీని డీజీపీ, డీజీపీని సీఎం రక్షిస్తున్నారని అని కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ ధ్వజమెత్తారు.

# 37 ఏళ్ల తర్వాత కొత్త ఎయిర్ ఫోర్స్ వన్...
## తొలిసారి ప్రయాణించిన ట్రంప్



ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, సుమారు 37 ఏళ్ల తర్వాత ఆధునికీకరించిన నూతన 'ఎయిర్ ఫోర్స్ వన్' విమానంలో తొలిసారిగా ప్రయాణించారు. నార్త్ డకోటాలో ఏర్పాటు చేసిన థియోడర్ రూజ్‌వెల్ట్ ప్రెసిడెన్షియల్ లైబ్రరీ ప్రారంభోత్సవానికి ఆయన ఈ కొత్త విమానంలోనే విచ్చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల విరామం అనంతరం అందుబాటులోకి వచ్చిన కొత్త అధ్యక్ష విమానంలో ఇదే తన తొలి ప్రయాణమని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మెడోరాలో నిర్వహించిన కార్యక్రమంలో మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. "37 ఏళ్ల తర్వాత ఎయిర్ ఫోర్స్ వన్ అనే ఒక ప్రత్యేక విమానంలో ఇది తొలి ప్రయాణం. ఇదొక అద్భుతమైన విమానం" అని ఆయన ప్రశంసించారు. తాను ఎంతగానో ఆరాధించే మాజీ అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ పట్ల గౌరవ సూచకంగా ఈ పర్యటన సాగింది. వైట్‌హౌస్‌లోని రూజ్‌వెల్ట్ రూమ్‌లో భద్రపరిచిన ఆయన 'కాంగ్రెషనల్ మెడల్ ఆఫ్ హానర్'ను ట్రంప్ స్వయంగా ఈ లైబ్రరీకి అందజేశారు. ఈ సంస్థ ప్రారంభోత్సవంలో పాల్గొన్న తొలి సిట్టింగ్ ప్రెసిడెంట్‌గా ట్రంప్ రికార్డు సృష్టించారు. ఈ కార్యక్రమానికి ఆతిథ్యమిచ్చిన ఇంటీరియర్ సెక్రటరీ డగ్ బర్గమ్ దీనిని ఒక "చారిత్రక ఘట్టం"గా అభివర్ణించారు. లైబ్రరీ ప్రారంభమైన తర్వాత, రూజ్‌వెల్ట్ రాసిన ప్రఖ్యాత "మ్యాన్ ఇన్ ది అరీనా" వ్యాసాన్ని ట్రంప్ చదువుతుండగా రూపొందించిన రికార్డింగ్‌ను సందర్శకులు వినవచ్చు. లైబ్రరీ తొలి ఏడాది ప్రదర్శనల కోసం నేషనల్ ఎండోమెంట్ ఫర్ హ్యుమానిటీస్ ద్వారా 7,50,000 డాలర్ల ఫెడరల్ గ్రాంటును కూడా ట్రంప్ ప్రకటించారు. ప్రస్తుత అధ్యక్ష విమానాలు గత మూడు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నాయి. వాణిజ్య విమానాలను అత్యంత సురక్షితమైన అధ్యక్ష విమానాలుగా మార్చడానికి అనేక సంక్లిష్ట నిబంధనలు ఉండటంతో, ఈ ఆధునికీకరణ పనులు చాలా ఏళ్లుగా కొనసాగుతున్నాయి. అమెరికా 250వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

## ప్రభుత్వ విజయాలపై జూలై 15 నుంచి
# ఇంటింటి ప్రచారం చేయాలి

రేణిగుంట మండలంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో లోకేష్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 150 రోజుల వ్యవధిలోనే 16,000 ఉపాధ్యాయ, 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ ఏడాది మరో 10,000 పోస్టులతో మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జూలై 15 నుంచి 'ఇంటింటి ప్రచారం' చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా, ప్రతిపక్ష పార్టీల వైఖరిని ప్రస్తావిస్తూ.. కార్యకర్తలు చెడు లక్షణాలను అలవర్చుకోవద్దని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా లోకేష్ పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి తనిఖీ చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించడంతో పాటు, పలువురు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# హైదరాబాద్‌లో పైలట్ ప్రాజెక్టు అమలు

మొదటి పేజి తరువాయి

ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అనలాగ్ ఏఐ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మేఘా ఇంజనీరింగ్ ఎండీ పి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు. భాగ్యనగరంలో ట్రాఫిక్ సిగ్నళ్లను ఏఐ సాంకేతికతతో అనుసంధానించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. ట్రాఫిక్ రద్దీకి, వాతావరణ మార్పులకు అనుగుణంగా సిగ్నళ్లు పనిచేసే విధానాన్ని తీసుకురావాలని కోరారు. భవిష్యత్తు తరాలకు అవసరమైన మేధోపరమైన మౌలిక సదుపాయాలు,ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాల అభివృద్ధికి అనలాగ్ ఏఐ, మేఘా ఇంజనీరింగ్ భాగస్వామ్యంలో చేస్తున్న ప్రయత్నాలను ఈ సమావేశంలో కృష్ణారెడ్డి, కిప్‌మాన్ సీఎంకు వివరించారు. ట్రాఫిక్ రద్దీని గుర్తించి తదనుగుణంగా నియంత్రణకు చర్యలు తీసుకోవడం, నీటి లీకేజీని గుర్తించి పైపులైన్ల మరమ్మతుల నిర్వహణకు ముందస్తు సూచనలు చేయడం, అవసరానికి అనుగుణంగా విద్యుత్ వాడకం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలకు దారి ఇవ్వడం వంటి కాగ్నిటివ్ సిటీ సదుపాయాల అభివృద్ధికి ఉన్న అవకాశాలను అనలాగ్ ఐఏ సీఈఓ కిప్‌మాన్ రేవంత్‌రెడ్డికి వివరించారు. నగర సమస్యల సత్వర పరిష్కారానికి దోహదపడే సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై చర్చించారు. నగరంలో అడ్వాన్స్‌డ్ ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫార్మ్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. సెన్సార్లు, రొబోటిక్స్ వంటి ఫిజికల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీ పరికరాల వినియోగంతో సురక్షితమైన, సమర్థవంతమైన, వేగంగా స్పందించే నగర రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. వేగంగా విస్తరిస్తున్న పట్టణాల అవసరాలకు తగ్గట్లు ప్రభుత్వాల పనితీరు సామర్థ్యం పెంపు, పౌర సేవల మెరుగుదల, డేటా ఆధారిత మౌలిక సదుపాయాల ప్రణాళిక తయారీకి అభివృద్ధి చెందుతున్న సాంకేతికత ఎలా దోహదపడుతుందో ఇరు సంస్థల ప్రతినిధులు సీఎంకు వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు ఎం.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు, ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, ఇన్వెస్ట్ సీఈఓ బి.అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

## భారత్-పాక్ మధ్య చర్చలు జరపండి..
# ఇరు దేశాల ప్రధానులకు 117 మంది ప్రముఖుల లేఖ

ఢిల్లీ: భారతదేశం, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించి, ఇరు దేశాల మధ్య చర్చల ప్రక్రియను పునఃప్రారంభించాలని కోరుతూ 117 మంది ప్రముఖులు ముందుకు వచ్చారు. భారత్, పాక్‌లకు చెందిన ఈ ప్రముఖులు ప్రధాని నరేంద్ర మోదీ, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లకు ఉమ్మడిగా ఒక లేఖ రాశారు. దౌత్య మార్గాలను తిరిగి తెరిచి, సంప్రదింపులకు శ్రీకారం చుట్టాలని వారు తమ లేఖలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహిస్తున్న ఢిల్లీకి చెందిన 'సెంటర్ ఫర్ పీస్ అండ్ ప్రోగ్రెస్' అధినేత ఓపీ షా ఈ విషయంపై మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలు ఏమాత్రం ఆశాజనకంగా లేవని, ఈ పరిస్థితి ఉపఖండంలోని సాధారణ ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య శాంతి, స్థిరత్వం, సాధారణ సంబంధాలు నెలకొంటేనే ప్రజల ఆర్థిక శ్రేయస్సు సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇరు దేశాలను సంఘర్షణ వైపు నడిపించే ఏ చిన్న సంఘటన అయినా ప్రజల జీవనోపాధిని, అభివృద్ధిని దెబ్బతీస్తుందని ఆయన వివరించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రదాడుల (26/11 ముంబై, పుల్వామా, పహల్గామ్) గురించి ప్రశ్నించగా.. చర్చలు, సంప్రదింపులపై తనకు పూర్తి విశ్వాసం ఉందని షా బదులిచ్చారు. ఉగ్రవాదం, భద్రతాపరమైన ఆందోళనలతో సహా అన్ని క్లిష్టమైన సమస్యలను దౌత్యపరమైన చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. చర్చలు నిరంతరాయంగా కొనసాగాలని, ఏ దశలోనూ ఇరు దేశాల మధ్య సంభాషణలు ఆగకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాదంపై భారత్ కఠినంగా వ్యవహరిస్తున్న తీరుపై స్పందిస్తూ.. ఎంతటి కఠినమైన సమస్యలైనా చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని షా పునరుద్ఘాటించారు. భారత్, పాకిస్థాన్‌లలోని లక్షలాది మంది ప్రజలు శాంతినే కోరుకుంటున్నారని, తమ శాంతి పిలుపునకు మద్దతుగా వేలాది మంది సంతకాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. నిరంతర చర్చల వల్ల ఒకరి ఆందోళనలు, పరిమితులు మరొకరు అర్థం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

# రూ.3,200 కోట్ల పెట్టుబడులు వేగవంతం చేయాలి

అమరావతి: శ్రీసిటీలోని హీరో మోటోకార్ప్ తయారీ కేంద్రంలో గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0 నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణపై తమ ప్రభుత్వం స్పష్టమైన దార్శనికతను వివరించారు. గతంలో తాము ప్రత్యేక చొరవ చూపి, చర్చలు జరిపి హీరో మోటోకార్ప్ ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. హీరో సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ బ్రిజ్‌మోహన్ లాల్ ముంజాల్‌ను జాతి నిర్మాణానికి సహకరించిన మహనీయుడిగా ముఖ్యమంత్రి కొనియాడారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పవన్ ముంజాల్ పేర్కొన్న విధంగా రూ. 3,200 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆయన కోరారు. భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలదేనని, మారుతున్న కాలానికి అనుగుణంగా 'వీడా' బ్రాండ్‌తో హీరో సంస్థ సిద్ధంగా ఉండాలని సూచించారు. తిరుపతి మహిళా పోలీసులకు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను అందించినందుకు సంస్థ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో గతంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' గురించి చర్చించేవారమని, అయితే ఇప్పుడు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిలో త్వరలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని, ఎల్లుండి కడప స్టీల్ ప్లాంట్ పనులను పునఃప్రారంభించబోతున్నామని ప్రకటించారు. విశాఖపట్నంలో గూగుల్ సంస్థ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తోందని వెల్లడిస్తూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సంపద సృష్టిస్తూనే, ఆ ఫలాలను పేదలకు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బ్యాంకు రుణాలను క్రమశిక్షణతో తిరిగి చెల్లిస్తూ, డ్వాక్రా మహిళలు నేడు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతుండటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## తమిళనాడులో గోవధపై హైకోర్టు నిషేధాన్ని
# సుప్రీంలో సవాల్ చేసిన విజయ్ ప్రభుత్వం

రాష్ట్రంలో అమలులో ఉన్న చట్టాలకు విరుద్ధంగా ఉందని, మతపరమైన ఆచారాలకు ఆటంకం కలిగిస్తోందని ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ వ్యవహారం ప్రస్తుతం తమిళనాట రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

### ప్రభుత్వ వాదనలు ఇవే..

మే 27న మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు.. 'తమిళనాడు జంతు సంరక్షణ చట్టం-1958' నిబంధనలకు విరుద్ధంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తోంది. ఈ చట్టం ప్రకారం పదేళ్లు దాటిన, వ్యవసాయ పనులకు లేదా సంతానోత్పత్తికి పనికిరావని పశువైద్య అధికారి ధ్రువీకరించిన ఆవులను వధించేందుకు అనుమతి ఉంది. అయితే, హైకోర్టు తీర్పు ఈ చట్టాన్ని పట్టించుకోకుండా, రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ నిషేధం విధించిందని ప్రభుత్వం తన అప్పీల్‌లో పేర్కొంది. వాస్తవానికి, కోయంబత్తూరులో బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో జంతువధను నిరోధించాలని మాత్రమే కోర్టులో పిటిషన్ దాఖలైందని, కానీ హైకోర్టు తన పరిధిని దాటి రాష్ట్రవ్యాప్త నిషేధానికి ఆదేశాలు జారీ చేసిందని ప్రభుత్వం వివరించింది.

### మత స్వేచ్ఛకు భంగం..

బక్రీద్ లేదా మరే ఇతర రోజుల్లోనూ ఆవులు, దూడలను వధించకుండా చూడాలని హైకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు కేవలం బక్రీద్ పండుగకే కాకుండా రాష్ట్రంలోని హిందూ దేవాలయాల్లో జరిగే జంతుబలులపై కూడా ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తమవుతోంది. పండుగల సమయంలో పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా లైసెన్స్ ఉన్న స్లాటర్‌హౌస్‌లలో వసతి కల్పించడం అసాధ్యమని, చాలా వాటికి అంత సామర్థ్యం లేదని పలువురు సామాజిక నాయకులు అంటున్నారు. ఎంఎంకే అధ్యక్షుడు ఎం.హెచ్. జవహిరుల్లా ఈ తీర్పును బాధాకరం అని అభివర్ణిస్తూ, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు హామీ ఇచ్చిన మత స్వేచ్ఛను హరించడమేనని అన్నారు.

ప్రతిపక్షాల విమర్శలు

ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయడంలో టీవీకే ప్రభుత్వం జాప్యం చేసిందని ప్రతిపక్ష డీఎంకే విమర్శించింది. డీఎంకే ప్రతినిధి డాక్టర్ సయ్యద్ హఫీజుల్లా మాట్లాడుతూ.. "పాలిచ్చే ఆవులను ఆర్థిక కారణాల వల్ల ఎవరూ వధించరు. ఈ తీర్పు కేవలం ఆవులకే కాకుండా ఎద్దులు, గేదెల వధను కూడా నిషేధిస్తోంది. ఇది ముస్లింలకే కాదు, ఆలయాల్లో బలులు ఇచ్చే హిందువుల ఆచారాలపైనా ప్రభావం చూపుతుంది" అని అన్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న జాప్యంపై స్పందించిన టీవీకే వర్గాలు.. "న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపేందుకు కొంత సమయం పట్టింది" అని వివరణ ఇచ్చాయి. ప్రస్తుతం ఉన్న చట్టాలు జంతువధకు సంబంధించి స్పష్టమైన నిబంధనలను నిర్దేశిస్తున్నాయని, హైకోర్టు తీర్పు 'జ్యుడీషియల్ లెజిస్లేషన్' (న్యాయవ్యవస్థ చట్టాలను రూపొందించడం) కిందకు వస్తుందని ప్రభుత్వం సుప్రీంకోర్టులో తన వాదనను వినిపించింది.

## బీఆర్ఎస్ నేతలవి పచ్చి అబద్ధాలు: పొన్నం ప్రభాకర్
# మేం కూడా చర్చకు సిద్ధం: హరీశ్‌రావు

మొదటి పేజి తరువాయి

గురుకులాల్లో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ ఆరోపణలపై చర్చించేందుకు తెలంగాణ మంత్రులు సిద్ధమయ్యారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ తదితరులు గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు ఎవరు వచ్చినా చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు రావాలని అన్నారు. మరోవైపు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్ నుంచి గన్‌పార్క్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆయన్ను వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి.

### బీఆర్ఎస్ నేతలవి పచ్చి అబద్ధాలు: పొన్నం ప్రభాకర్

" మీరు చేసిన వ్యాఖ్యలు నిజమైతే చర్చకు రావాలి. హాస్టళ్లలో అవినీతి జరిగిందని కేటీఆర్, హరీశ్‌రావు, ప్రవీణ్‌కుమార్ ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ నేతలవి పచ్చి అబద్ధాలు. మాపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. ప్రజలందరికీ నిజం తెలియాలి. మొత్తం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా జరిపాం. నాలుగు శాఖల ఆధ్వర్యంలో పారదర్శకంగా టెండర్లు పిలిచాం. టెండర్లలో ఎవరైనా పాల్గొనవచ్చనే విషయం తెలియదా. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలు బాగుపడుతుంటే తట్టుకోలేకపోతున్నారు. ప్రజలు ఎన్నుకున్న నాయకులే చర్చకు రావాలని కోరుతున్నాం. పదేళ్లుగా మీరు చేసిన ప్రొక్యూర్‌మెంట్‌పై కూడా చర్చకు సిద్ధంగా ఉన్నాం. అధికారిగా చేసిన ప్రవీణ్‌కుమార్ కూడా లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. ఎవరో, ఏదో తప్పుడు సమాచారం ఇస్తే.. దానిపై మాట్లాడొద్దు" అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

### మేం కూడా చర్చకు సిద్ధం: హరీశ్‌రావు

మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ అప్పుల గురించి చర్చకు సిద్ధంగా ఉన్నట్లు బీఆర్ఎస్ నేతలు వెల్లడించారు. ఈ మేరకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అప్పులపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తానని మంత్రి జూపల్లి చెప్పారని, అందుకే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో ఉంటారని హరీశ్‌రావు అన్నారు. మంత్రులతో చర్చించేందుకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఇతర నేతలతో కలిసి అమరవీరుల స్తూపం వద్దకు బయల్దేరారు. పోలీసులు ఆయన వాహనాన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. చర్చకు వస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలని హరీశ్‌రావు నిలదీశారు. " హాస్టళ్లలో అవినీతి జరిగింది. అందుకే కాంగ్రెస్ మంత్రులు భయపడుతున్నారు. పోలీసులను పెట్టి అడ్డుకుంటే మీరు పారిపోతున్నట్లే లెక్క. గన్‌పార్క్‌కు నడుచుకుంటూ వెళ్తాం" అంటూ కారు దిగి నడిచి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు మిన్నంటాయి. పోలీసు వలయాన్ని తోసుకుంటూ బీఆర్ఎస్ నేతలు ముందుకు వెళ్లడంతో హరీశ్‌రావుతోపాటు పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు.

## ఆధారాలు లేని ఆరోపణలు సహించం..
# సోషల్ మీడియా దుర్వినియోగంపై పవన్ హెచ్చరిక!



అమరావతి: సోషల్ మీడియా దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. ఒకరి హక్కులను మరొకరు హరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును స్వాగతిస్తామని, కానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సహించబోమని స్పష్టం చేశారు. మత విశ్వాసాలను దెబ్బతీయడం రాజ్యాంగం కల్పించిన హక్కు కాదని పవన్ అన్నారు. వ్యక్తిగత దూషణలు, చంపేస్తామని బెదిరించడం, దేవుళ్లు, దేవతలపై ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. నిర్మాణాత్మక విమర్శలను ప్రభుత్వం ఎప్పుడూ స్వాగతిస్తుందని చెప్పారు. సైబర్ వేధింపులు, పరువు ప్రతిష్ఠలను దెబ్బతీసే చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని పవన్ పేర్కొన్నారు. నేరస్థులకు కులం, మతం ఉండదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బాధితులు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# విజయ్ మార్క్ పాలన: రెండు నెలల్లోనే ప్రజాధనం ఆదా!

తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం అధికారం పగ్గాలు చేపట్టిన రెండు నెలల్లోనే పాలనలో సత్ఫలితాలను సాధిస్తోంది. ప్రజా పనుల టెండర్లలో పారదర్శక విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వ ఖజానాపై భారాన్ని తగ్గిస్తూ, భారీ మొత్తంలో ప్రజాధనాన్ని ఆదా చేస్తోంది. చిన్నపాటి కాంట్రాక్టులకు సైతం ఓపెన్ టెండరింగ్ విధానాన్ని తప్పనిసరి చేయడంతో, కాంట్రాక్టర్లు అంచనా వ్యయం కంటే 25 నుంచి 30 శాతం తక్కువ ధరలకే పనులను దక్కించుకుంటున్నారు. మే 10, 2026న బాధ్యతలు స్వీకరించిన వెంటనే, ముఖ్యమంత్రి విజయ్ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర అప్పులు రూ. 10 లక్షల కోట్లు దాటాయని వెల్లడి కావడంతో, ప్రభుత్వ వ్యయంలో కీలకమైన ప్రజా పనుల విభాగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. కార్టెల్స్, కమిషన్ల సంస్కృతికి అడ్డుకట్ట వేసేందుకు పరిమిత టెండర్ల విధానాన్ని రద్దు చేశారు. ఈ మార్పుతో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో స్పష్టమైన ఫలితాలు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు, అంబత్తూరులో రూ. 25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టాల్సిన ఒక పనికి, కాంట్రాక్టర్లు 25.9 శాతం తక్కువకు, అంటే సుమారు రూ. 16 నుంచి 17 లక్షలకే బిడ్ దాఖలు చేశారు. తద్వారా ఒక్క టెండర్‌లోనే సుమారు రూ. 9 లక్షల ప్రజాధనం ఆదా అయింది. గతంలో ఇవే పనులను అంచనా విలువ కంటే 10 శాతం అదనపు ధరలకు కేటాయించేవారని, అంటే రూ. 25 లక్షల పనికి రూ. 27.5 లక్షలు వెచ్చించేవారని గ్రేటర్ చెన్నై కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు రామారావు తెలిపారు. అయితే ప్రస్తుతం పారదర్శకత కారణంగా అదే పని సుమారు రూ. 16 లక్షలకే పూర్తవుతోందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో కమిషన్ల రూపంలో భారీగా అవినీతి జరిగిందని, తమ ప్రభుత్వంలో లంచాలకు తావులేదని ప్రజా పనుల శాఖ మంత్రి ఆధవ్ అర్జున ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## తెలంగాణలోని నిరుద్యోగులకు తీపి కబురు..
# ఇంటర్వ్యూలు లేకుండానే 984 వర్సిటీ ఉద్యోగాల భర్తీ

హైదరాబాద్: తెలంగాణలోని నిరుద్యోగ యువతకు, విద్యావంతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రంలోని మూడు ప్రతిష్ఠాత్మక వ్యవసాయ అనుబంధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 984 అధ్యాపక, ఇతర పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. ఈ నియామక ప్రక్రియలో అత్యంత కీలకమైన మార్పునకు శ్రీకారం చుడుతూ, ఇప్పటివరకు ఉన్న ఇంటర్వ్యూ విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇకపై కేవలం రాతపరీక్షలో సాధించిన మార్కులు, అకడమిక్ మెరిట్ ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ఏయూ), కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ), పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం (పీవీఎన్ఆర్‌టీవీయూ)లలో ఈ నియామకాలు చేపట్టనున్నారు. వ్యవసాయ శాఖపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నియామక ప్రక్రియలో పారదర్శకతను పెంచడం, ఎలాంటి అవినీతి, సిఫార్సులకు తావులేకుండా చూడటమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే గ్రూప్-1 వంటి ఉన్నతస్థాయి ఉద్యోగ నియామకాల్లో ఇంటర్వ్యూలను రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, అదే విధానాన్ని విశ్వవిద్యాలయాల నియామకాల్లోనూ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

### భర్తీ కానున్న పోస్టుల వివరాలు

ప్రభుత్వ నిర్ణయంతో మూడు వర్సిటీల్లో నియామకాల ప్రక్రియ వేగవంతం కానుంది. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం తమ పరిధిలో 550 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఇంటర్వ్యూలు లేకుండా కేవలం రాతపరీక్ష మార్కుల ఆధారంగానే ఈ పోస్టులను భర్తీ చేసేందుకు త్వరలోనే కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తామని వర్సిటీ వైస్ ఛాన్సలర్ జానయ్య తెలిపారు. మరోవైపు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఇప్పటికే 140 పోస్టుల (79 అసిస్టెంట్ ప్రొఫెసర్, 44 అసోసియేట్ ప్రొఫెసర్, 17 ప్రొఫెసర్) భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, ఆ ప్రక్రియలో కూడా ఇంటర్వ్యూలను మినహాయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక, పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో బ్యాక్‌లాగ్, కొత్త ఖాళీలతో కలిపి మొత్తం 294 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు కూడా కొత్త నిబంధనే వర్తిస్తుంది.

అభ్యర్థులు, విద్యావేత్తల హర్షం

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై నిరుద్యోగ అభ్యర్థుల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇంటర్వ్యూల పేరుతో జరిగే అవకతవకలకు, సిఫార్సులకు చెక్ పడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు లభించే అవకాశం కలగడం వల్ల గ్రామీణ, పేద నేపథ్యం ఉన్న అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని విద్యావేత్తలు సైతం అభిప్రాయపడుతున్నారు. సంబంధిత విశ్వవిద్యాలయాల బోర్డులు త్వరలోనే ఈ పోస్టులకు సంబంధించిన పూర్తి సిలబస్, పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయి.

నేటి శుభోదయ
ప్రతి క్షణం – ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## "ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం తెదేపా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీమతి దాసరి కృష్ణవేణి"



పెంటపాడు జూలై 2 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయం):::: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయవలసిన బాధ్యత అందరి పైన ఉందని మన పూర్వీకులు అందరూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఎంతో ఉన్నత స్థితికి వెళ్లారని ఈ పాఠశాలల్లో శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన, ఉన్నత విద్యార్హతలు గల ఉపాధ్యాయులు ఎంతో చక్కగా బోధిస్తున్నారని ఆమె అభినందించారు. పెంటపాడు మోడల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్యఅతిథిగా శ్రీమతి దాసరి కృష్ణవేణి పాల్గొన్నారు. ప్రభుత్వం ద్వారా సరఫరా చేయబడిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులను అభినందించారు. మండల విద్యాశాఖ అధికారి 1 మరియు 2 ఎం. శ్రీనివాస్, టీవీ. రామకృష్ణ గార్లు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రుల సహాయ సహకారం ఎంతో అవసరమని సమాజ భాగస్వామ్యం ఉంటేనే ప్రతి ప్రభుత్వ వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని అన్నారు. పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షురాలు డి.శాంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరిమామిళ్ల పెద్దిరాజు సారధ్యంలో నిర్వహించబడింది. ఈ నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలో చేపట్టబోతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఎం. పుష్పవతి, ఎస్.కృపారాణి,ఓ.ప్రసన్న మానస,సిఆర్పి చిట్టెమ్మ పాల్గొన్నారు.

## సత్యసాయి బాబా ఆశయానికి పడ్డాయి బీటలు...

**18 రోజుగా కొనసాగుతున్న సత్యసాయి కార్మికుల సమ్మె ..!!.**

**అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోని వైనం... !**

**– ప్రజలకు ఈ ప్రాజెక్టు మూతపడిందా అనే అనుమానం...!**




రాజమహేంద్రవరం, కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); ప్రభుత్వం నిర్వహించాల్సిన ప్రాజెక్టులను కమిషన్ కోసం కాంట్రాక్టు దోచుపెట్టడం సమంజసమేనా...నిత్యవసర పథకాల పైన ఇంత నిర్లక్ష్యం తగునా అని...ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.రాజమహేంద్రవరం గ్రామీణ నీటి సరఫరా కార్యాలయం నందు కొనసాగుతున్న శ్రీ సత్య సాయి త్రాగునీటి పథకం కార్మికులు సమ్మె కొనసాగించడం జరుగుతుంది. 18 రోజులు గడుస్తున్న కాంట్రాక్టర్ టీ వి వి సత్యనారాయణ , జి వి వి రావు (దొరబాబు) స్పందించకపోవడం దారుణమని కార్మికుల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బిల్లులు లేటవుతుంద అనే కారణంతో కాంట్రాక్టర్ మెయింటినెన్స్ చేయకపోవడం వల్ల ప్రాజెక్టు నిర్వీర్యం అయిందని అలాంటి కాంట్రాక్టర్ ని బ్లాక్ లిస్టులో పెట్టాలని కార్మికుల డిమాండ్ చేశారు. ఏడు నెల జీతాలు వెంటనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించకపోవడం వల్ల ఆరోగ్య భీమా కోల్పోతున్నామని వాపోయారు. ఈ పథకానికి ాడవీ ఆపరేషన్ అండ్ మెయిన్టనెన్స్ సపరేట్ చేసి నెల నెలా జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు. ఆప్కోస్ ద్వారా అయినా నెల నెలా జీతాలు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని కోరుచున్నారు, లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని తెలియజేశారు. తూర్పు సత్య సాయి ప్రాజెక్ట్ పై సవతి ప్రేమ చూపిస్తున్నారని మిగతా జిల్లాల ప్రాజెక్టులకు విడుదల చేస్తున్న నిధులు ఆర్థిక శాఖ మంత్రి , తూర్పుగోదావరి జిల్లాకు నిధులు విడుదల చేయట్లేదని దానివల్ల మరింత దారుణమైన పరిస్థితిలోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం పరిచారు. శ్రీ సత్యసాయి తాగునీటి పథకానికి శాశ్వత పరిష్కారం చూపిస్తూ నిర్ణయం తీసుకోవాలని కార్మికుల కోరారు. కాంట్రాక్టర్ల దోపిడీ నుంచి తప్పించి ప్రభుత్వమే నిర్వహించేలా వికాస ద్వారా జీతాలను చెల్లించేలా చూడాలని ఎన్డీఏ ఓటమి ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నారు. మొన్న మాట మంతి కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రులు అయినటువంటి పవన్ కళ్యాణ్కు కార్మికుల గోడు వినపడలేదా, కనబడలేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

## సివిల్ పంచాయతీలో మంత్రి తనయుడి మితి మీరిన జోక్యం

**విడదీసి పాలన సాగిస్తున్న వైనం – ఫరం పేరుతో ఉన్న ఆస్తి ఒక్కరికే సొంతమా**



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో గల శ్రీనివాస నగర్ పరిధిలో గల అయ్యప్ప స్వామి దేవాలయానికి ఎదురుగా ఉన్న పరిశ్రమ పేరుతో ఉన్న ఫరం ఆస్థిని ఒక్కరికే ఎలా సొంతం అవుతుంది అనే అనుమానం కలగమానదు. ఆయన మాజీ కౌన్సిలర్ అనైంత మాత్రాన ఉమ్మడి ఆస్థిని తనకే చెందేలా సివిల్ పంచాయతీ చేయడం ఎంతా వరకు సబబు అని మిగితా భాగస్వామ్యంతో ఉన్న వ్యక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ పంచాయతీలో ఉన్న ఆస్థిని ఉమ్మడిగా అమ్మడం లేదా అందరి సమక్షంలో ధర నిర్ణయించి తీసుకోవడం జరగాలి కానీ అలా కాకుండా తమకు అనుకూలంగా ఉన్న ఒకరికే చెందేలా ఓ సీనియర్ మంత్రి క్యాంప్ కార్యాలయంలో సివిల్ పంచాయతీని ఆ మంత్రి తనయుడు నిర్వహించడం పట్ల తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇదేమిటి అని మిగితా భాగస్వామ్యంతో ఉన్న వారు సైతం ఏమి మాట్లాడలేని పరిస్థితి నెలకొంది అని లబోదిబోమంటున్నారు. ఈ ఫరం పేరుతో ఉన్న ఆస్థిని కాజేసేందుకు ప్రయత్నం చేస్తున్న మాజీ కౌన్సిలర్ కి వత్తాసు పలకడం వెనుక పలు రకాల అనుమానాలకు తావు ఇస్తోంది. ఈ పంచాయతీలో టిడిపి నాయకులతో పాటు మంత్రి తనయుడు ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ పంచాయతీలో జరుగుతున్న అంశాలను పరిగణనలోకి తీసుకుంటే విడ దీసి పాలన చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. ఈ పంచాయతీ పలువురు అతిగా జోక్యం చేసుకుంటూ ముందుకు వెళ్ళితే తీవ్ర పరిణామాలు చవి చూసే ప్రమాదం లేకపోలేదు. మరోవైపు ఫరం పేరుతో ఉన్న ఆస్థికి సంబంధించిన భూమిలో ఓ కౌన్సిలర్ తనకు ఉన్న బలాన్ని ఉపయోగించి షాపింగ్ పేరుతో పదికి పైగా గదుల నిర్మాణం చేయడం జరుగుతుంది. ఈ నిర్మాణంకు సంబంధించి ఖమ్మం కార్పొరేషన్ లో టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేయడం కూడా పెద్ద తప్పిదం అని చెప్పక తప్పదు. ఈ ఫరం పేరుతో ఉన్న ఆస్తి విషయం పరిధికి మించి పలువురు జోక్యం చేసుకోవడం వల్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ భూమి విషయంలో రాజకీయ పార్టీల నేతలు, మంత్రి తనయుడి జోక్యం కారణంగా వారంతా అభాసు పాలవడం చోటు చేసుకుంటుంది. ఇప్పటికైనా ఫరం పేరుతో ఉన్న ఆస్తికి సంబంధించిన వ్యక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్ళాలని ఆ స్థలం భాగస్వామ్యంలో ఉన్న పలువురు తమ నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకొని పంచాయతీ చేయాలని కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా ఖమ్మం నగర పాలక సంస్థ కు ఆ నిర్మాణం ఏ పేరుతో చేస్తున్నారు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి.

## విగ్రహ ప్రతిష్ఠాపనకు మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి రూ.1.30,116 విరాళం



అనంత పురం బ్యూరో జూలై 02 నేటి శుభోదయ :శింగనమల నియోజక వర్గం బుక్కరాయసముద్రం మండల పరిధిలోని చెరువు కట్టపై ఏర్పాటు చేయనున్న 24 అడుగుల శ్రీ షిర్డీ సాయిబాబా నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కోసం శింగనమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి దంపతులు తమ వంతు సహకారంగా రూ.1,30,116 విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు.అనంతపురం నగరంలోని తమ నివాసంలో ఆలయ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఆలయ గౌరవ అధ్యక్షుడు విజయనాథ్ లకు మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామి రెడ్డి విరాళాన్ని అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం విజయవంతం కావాలని వారు ఆకాంక్షించారు.ఆలయ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే దంపతులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి ఉదార సహకారం 24 అడుగుల శ్రీ షిర్డీ సాయిబాబా నూతన విగ్రహ నిర్మాణం, ప్రతిష్ఠాపన కార్యక్రమం, ఆలయ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

## మార్కెట్ యార్డును అభివృద్ధి చేయడమే తన లక్ష్యం

**వాస్తవాలను అవాస్తవాలుగా మార్చకండి..మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి**



అనంత పురం బ్యూరో జూలై 02 నేటి శుభోదయ :గత ప్రభుత్వ హయాంలో అనంతపురం మార్కెట్ యార్డులోరెస్ట్‌రూమ్‌లు ఏ రోజూ వినియోగంలోకి రాలేదు. లైట్లు, ఫ్యాన్లు, బాత్‌రూమ్‌లు, నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. నేను మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత వాటిని అన్నీ సిద్ధం చేయించాం. ప్రస్తుతం పెయింటింగ్ పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని మాత్రం ఎందుకు ప్రస్తావించ లేదని మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లాపల్లవి పేర్కొన్నారు. గురువారం అనంతపూర్ నగరంలోని మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ ఛాంబర్ లో చైర్ పర్సన్ బల్లాపల్లవి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఓ ప్రముఖ పత్రికలో తన గురించి అవాస్తవాలు ప్రచురిస్తున్నారని వార్తలు రాసేటప్పుడు వాస్తవాలు తెలుసుకొని వార్తలు రాయాలని చైర్ పర్సన్ బల్లాపల్లవి స్పష్టం చేశారు.క్యాంటీన్‌ను టెండర్ ద్వారా రమణయ్య అనే వ్యక్తికి కేటాయించారు. ఆయన ఎలాంటి ఇబ్బందులు లేదా అసౌకర్యం కలగకుండా రైతుల సౌకర్యార్థం ఒక చిన్న షెడ్ ఏర్పాటు చేశారు. దీనివల్ల మార్కెట్‌కు గానీ, రైతులకు గానీ ఎలాంటి ఇబ్బంది లేదు. సుమారు 10 మంది రైతులు అక్కడ కూర్చొని భోజనం చేయడానికి, ఎండ నుంచి రక్షణ పొందడానికి ఆ షెడ్‌ను ఉపయోగిస్తున్నారు. ఒకసారి స్వయంగా వచ్చి పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి మీకే అర్థమవుతుంది.కొత్త కవరింగ్ షెడ్డులో నిలిచిన మురుగు అని రాశారు. కానీ ప్రస్తుతం అక్కడ ఒక్క చుక్క నీరు కూడా లేదు. వర్షం కురిసినప్పుడు కొంత నీరు నిలవడం వాస్తవమే. ఎందుకంటే షెడ్‌కు ఎడమ, కుడి వైపులా ఎత్తుగా ఉండడం వల్ల వర్షపు నీరు అక్కడికి చేరుతుంది. అలాగే గతంలో షెడ్ నిర్మాణం సమయంలో డ్రైనేజీ సౌకర్యం ఏర్పాటు చేయలేదు.వాస్తవాలను వాస్తవాలుగానే చూపించే వారినే మేము నమ్ముతాం... వారికే విలువ ఇస్తాం. అలాంటి వారినే గౌరవిస్తాం. వాస్తవాలు కాకుండా, ఎవరో చెప్పారని ఆధారంలేకుండా రాయడం, లేనిది ఉన్నట్టుగా... ఉన్నది లేనట్టుగా చూపించే వారిని చూసి భయపడే ప్రసక్తే లేదు. అలాంటి ప్రచారాలను మేము అసలు పట్టించుకోము. ఇంకా ఎంత రాసుకున్నా రాసుకోండి... నిజాన్ని మాత్రం మార్చలేరు. చివరికి నిలిచేది వాస్తవమే అని అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ బల్లా పల్లవి పేర్కొన్నారు.

## పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్త కుటుంబానికి టీడీపీ అండ

**–ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**

**–టీడీపీ సభ్యత్వ ప్రమాద భీమా పథకం కింద రూ.10 లక్షల చెక్కుల పంపిణీ**



విజయవాడ, జులై 2(అజయ్ నారగాని– నేటి శుభోదయ ) పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ప్రతి కార్యకర్త కుటుంబానికి ఆపద సమయంలో అండగా నిలవడం తెలుగుదేశం పార్టీ బాధ్యత అని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిడమానూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త దుర్గాప్రసాద్ గరికపాటి అకాల మరణంతో, పార్టీ సభ్యత్వ ప్రమాద భీమా కింద ఆయన భార్య, నామినీ వరలక్ష్మి గరికపాటికి రూ.5 లక్షల భీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అలాగే ఉంగుటూరు మండలం అత్కూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రమేష్ సోంగా మృతి చెందడంతో, ఆయన భార్య, నామినీ సరళ సోంగాకు రూ.5 లక్షల ప్రమాద భీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ పార్టీ కోసం సేవలందించిన ప్రతి కార్యకర్త కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో టీడీపీ సభ్యత్వ ప్రమాద భీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లో ఈ భీమా సాయం బాధిత కుటుంబాలకు ఎంతో తోడ్పాటునిస్తుందన్నారు. ఈ ఇద్దరితో కలిపి గన్నవరం నియోజకవర్గంలో ఇప్పటివరకు మొత్తం 13 మంది టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు సభ్యత్వ ప్రమాద భీమా సాయాన్ని అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నాయకత్వంలో కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, పార్టీ కోసం శ్రమించే ప్రతి కార్యకర్తకు, వారి కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు.

## రైతు సంఘం మహాసభలకు ముస్తాబైన ఏలూరు

**– రైతు సంఘం జెండాలు, తోరణాలతో అలంకరణ**

**నేడు హలో రైతన్న, చలో ఏలూరు, రైతుల మహా ప్రదర్శన,బహిరంగ సభ**

**ఏలూరు రానున్న అఖిలభారత రైతు సంఘం జాతీయ నాయకులు**

**– రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి**

**– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి**




ఏలూరు, నేటి శుభోదయ ::: నేటి నుండి మూడు రోజులపాటు జరగనున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలకు ఏలూరు ముస్తాబు అయింది. రైతు సంఘం జెండాలు, తోరణాలు, ప్రత్యేక ద్వారాలతో అలంకరణ చేశారు. నగరంలో విస్తృతంగా కరపాత్ర పంపిణీ చేసి హలో రైతన్న –చలో ఏలూరు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతు ఉద్యమాలకు కేంద్రంగా ఉన్న ఏలూరులో రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయయని చెప్పారు. ఎన్నో పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఏలూరుకు ఉందన్నారు. చారిత్రకంగా రైతు ఉద్యమాలకు ఏలూరు కేంద్రంగా ఉందని, అలాంటి ప్రాంతంలో ఈ మహాసభలు జరుగుతున్నాయని వివరించారు. రేపు జరిగే బహిరంగ సభ,రైతు మహా ప్రదర్శనకు అఖిలభారత రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, జాతీయ సహాయ కార్యదర్శి టి.సాగర్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారని చెప్పారు. అన్ని పంటల రైతులు ఏలూరుకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. మూడు రోజులపాటు జరిగే ఈ మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీలు చేసిన 500 మంది రైతు ప్రతినిధులు పాల్గొంటారని, రేపు జరిగే రైతు మహాప్రదర్శన, బహిరంగ సభలో వేలాది మంది రైతాంగం తరలి వస్తున్నారని చెప్పారు. నేడు వ్యవసాయం సంక్షోభంలో ఉందని, రైతు నష్టాల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం, రైతాంగాన్ని రక్షించుకుందాం. అందుకు అందరూ తరలిరావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు బి. బలరాం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. లింగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, నాయకులు కోన శ్రీనివాసరావు, ఎన్. రమణారావు, పలువురు రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.




## సివిల్ పంచాయతీలో మంత్రి తనయుడి మితి మీరిన జోక్యం

**– విడదీసి పాలన సాగిస్తున్న వైనం– ఫరం పేరుతో ఉన్న ఆస్తి ఒక్కరికే సొంతమా**



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో గల శ్రీనివాస నగర్ పరిధిలో గల అయ్యప్ప స్వామి దేవాలయానికి ఎదురుగా ఉన్న పరిశ్రమ పేరుతో ఉన్న ఫరం ఆస్థిని ఒక్కరికే ఎలా సొంతం అవుతుంది అనే అనుమానం కలగమానదు. ఆయన మాజీ కౌన్సిలర్ అనైంత మాత్రాన ఉమ్మడి ఆస్థిని తనకే చెందేలా సివిల్ పంచాయతీ చేయడం ఎంతా వరకు సబబు అని మిగితా భాగస్వామ్యంతో ఉన్న వ్యక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ పంచాయతీలో ఉన్న ఆస్థిని ఉమ్మడిగా అమ్మడం లేదా అందరి సమక్షంలో ధర నిర్ణయించి తీసుకోవడం జరగాలి కానీ అలా కాకుండా తమకు అనుకూలంగా ఉన్న ఒకరికే చెందేలా ఓ సీనియర్ మంత్రి క్యాంప్ కార్యాలయంలో సివిల్ పంచాయతీని ఆ మంత్రి తనయుడు నిర్వహించడం పట్ల తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇదేమిటి అని మిగితా భాగస్వామ్యంతో ఉన్న వారు సైతం ఏమి మాట్లాడలేని పరిస్థితి నెలకొంది అని లబోదిబోమంటున్నారు. ఈ ఫరం పేరుతో ఉన్న ఆస్థిని కాజేసేందుకు ప్రయత్నం చేస్తున్న మాజీ కౌన్సిలర్ కి వత్తాసు పలకడం వెనుక పలు రకాల అనుమానాలకు తావు ఇస్తోంది. ఈ పంచాయతీలో టిడిపి నాయకులతో పాటు మంత్రి తనయుడు ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ పంచాయతీలో జరుగుతున్న అంశాలను పరిగణనలోకి తీసుకుంటే విడ దీసి పాలన చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. ఈ పంచాయతీ పలువురు అతిగా జోక్యం చేసుకుంటూ ముందుకు వెళ్ళితే తీవ్ర పరిణామాలు చవి చూసే ప్రమాదం లేకపోలేదు. మరోవైపు ఫరం పేరుతో ఉన్న ఆస్థికి సంబంధించిన భూమిలో ఓ కౌన్సిలర్ తనకు ఉన్న బలాన్ని ఉపయోగించి షాపింగ్ పేరుతో పదికి పైగా గదుల నిర్మాణం చేయడం జరుగుతుంది. ఈ నిర్మాణంకు సంబంధించి ఖమ్మం కార్పొరేషన్ లో టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేయడం కూడా పెద్ద తప్పిదం అని చెప్పక తప్పదు. ఈ ఫరం పేరుతో ఉన్న ఆస్తి విషయం పరిధికి మించి పలువురు జోక్యం చేసుకోవడం వల్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ భూమి విషయంలో రాజకీయ పార్టీల నేతలు, మంత్రి తనయుడి జోక్యం కారణంగా వారంతా అభాసు పాలవడం చోటు చేసుకుంటుంది. ఇప్పటికైనా ఫరం పేరుతో ఉన్న ఆస్తికి సంబంధించిన వ్యక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్ళాలని ఆ స్థలం భాగస్వామ్యంలో ఉన్న పలువురు తమ నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకొని పంచాయతీ చేయాలని కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా ఖమ్మం నగర పాలక సంస్థ కు ఆ నిర్మాణం ఏ పేరుతో చేస్తున్నారు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి.



## గాయకుడే కాదు కళాపోషకుడు కూడా

**– వీవీ రెడ్డి పై ప్రత్యేక కథనం**



హైదరాబాద్, ఖమ్మం, నేటి శుభోదయ ::: సున్నిత మనస్కుడై సేవా దృక్పథం కలవాడై సామాజిక అంశాలకు స్పందించేవాడే కళాకారుడు. తనకున్న కళను తనకే పరిమితం చేయకుండా పదిమందికి అందిస్తూ సాటి కళాకారులకు చేయూతనందించేవాడే కళాకారుడు.తన ఆటతో పాటతో ప్రజల్ని ఆనందపరుస్తూ జనం కోసం జనం ముందు మంచి ప్రదర్శన చేయాలని పరితపించే జిజ్ఞాస కలవాడే కళాకారుడు.ఒక కళాకారుడిని మరో కళాకారుడిని ప్రత్సహించడం,తమకున్న దాంట్లో కొంత కళాసంస్థలకు అందించి చేయూతనివ్వడం ఒక సలక్షణం .సుగుణం.ఇటువంటి లక్షణాలను పునికిపుచ్చుకున్నారు ఖమ్మం నగరానికి చెందిన వేమిరెడ్డి వెంకట్రామిరెడ్డి (వీవీ రెడ్డి)పాతికేళ్లుగా ఖమ్మం కళారంగంలో గాయకునిగా,కళా పోషకునిగా సేవలందిస్తున్నారు. స్వరసుధ మ్యూజిక్ యూనిట్ ఉపాధ్యక్షునిగా ఆ సంస్థ ప్రధాన గాయకునిగా వ్యవహరిస్తున్న వీవీ రెడ్డి నగరంలోని 14 కళా సంస్థల కు తరచూ ఆర్థికంగా,హార్థికంగా సహాయ సహకారాలందిస్తుండడం గమనార్హం.ఏదో ఒక సందర్భంలో ఆయా సంస్థలు ఆయన తోడ్పాటు తీసుకున్నవే. అదేవిధంగా కళాకారులను వ్యక్తగతంగా కూడా ఆదుకున్న సందర్భాలున్నాయి. దేవాలయాలకు,అన్నదానాలకు విరాళాలు అందించడం,గుప్త దానాలు చేయడం విశేషం. సున్నితమైన స్వభావం గల రెడ్డి కళాకారులందరిని సమాదరించే వ్యక్తి.గాయకుడిని అనే అహం లేదు.ఎస్పీ బాలును అభిమానించి ఆరాధించే కోట్లాది మందిలో తానొకడిని మాత్రమేనని,ఆ మహానుభావుడి పాటల పల్లవుల పల్లకి మోసే బోయీని మాత్రమేనని వినయపూర్వకంగా చెప్పుకుంటారాయన. తను పాడుతూ పదిమందిని ప్రోత్సహిస్తూ కళా సంస్థల నిర్వాహకులకు కార్యక్రమాలు జరుపుకునే ఆర్థిక వెసులుబాటును కల్పించే ఆయనను కళా పోషకునిగా అభివర్ణించవచ్చు.సంస్థలకు భూరి విరాళాలు అందించే దాతగా అందరూ అంటుంటారు.మరో విషయమేమంటే ఆయన చేయూత మీద ఆధారపడి ఈవెంట్లు నిర్వహించే నిర్వాహకులున్నారంటే అతిశయోక్తికాదు.

### - నిరంతర సాధకుడు

వీవీ రెడ్డి పాటలపై వున్న తపన ఎటువంటిదంటే ఎన్ని ఈవెంట్లు చేసినా ఎన్ని పాటలు పాడినా తీరని పాటల దాహం ఆయనది. పాడుతున్న పాటలపై తీవ్ర కసరత్తు చేస్తుంటారు.నిరంతరం అలుపెరుగని సాధన చేస్తుంటారు కాబట్టే ఆయన ప్రదర్శనలో బలమైన బరువైన పాటలు ప్రేక్షకులకు వినిపిస్తుంటారు. కఠినమైన పాటలుగా ప్రసిద్ధి చెందిన శివశంకరీ శివానందలహరి, రసికరాజ తగువారము కామా,హాయి హాయిగా ఆమని సాగే,శ్రీ తుంబుర నాదామృతం,శివరంజనీ నవరాగిణీ,నా పాట పంచామృతం,శంకరా నాద శరీరాపరా వంటి గీతాలతో పాటు భగవద్గీత శ్లోకాలను వేదికపై పాడడం ఒక సాహసమే. ఆ పాటలను పాడడానికి కఠోర పరిశ్రమ ద్వారానే ఆయనకు సాధ్యమైంది.ఈ విషయంలో ఆయన సాధన, కృషి, పట్టుదల, ప్రయత్నాలను అభినందించక తప్పదు.

### - రికార్డుల సాధనపై గురి

ఇన్నేళ్లుగా ఎన్నో ప్రదేశాలలో ఎన్నో ఈవెంట్లలో పాల్గొని అవార్డులు పొందిన రెడ్డి ప్రస్తుతం రికార్డులు సాధించాలనే ధ్యేయంతో ఈ నెల 12 న భారీ కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. స్వరమధురిమ కల్చరల్స్ నిర్వహణలో ఆ సంస్థ అధ్యక్షులు ఇసనపల్లి నగేష్ పర్యవేక్షణలో ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రం వేదికగా మళ్లీ మళ్లీ ఇది రాని రోజు పేరుతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.అగ్రశ్రేణి సినీ నటుడు చిరంజీవి పుట్టిన రోజును పురస్కరించుకొని సంగీత దర్శకుడు ఇళయరాజా స్వరపర్చగా బాలు పాడిన చిరంజీవి చిత్రాలలోని 150 గీతాలను 20 మంది గాయనీమణులతో కలిసి 15 గంటలపాటు నిర్విరామ దీర్ఘ గానాలాపనకు నడుం బిగించారు.దీంతో ఏక కాలంలో 9 ప్రపంచ రికార్డులు సృష్టించబోతున్నారు.ఆరోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు గానార్చన జరుగుతుందని నిర్వాహకులు నగేష్ తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి విక్షిత్ భారత్ ఎంతగానో దోహదపడుతుంది

**-పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్**



పెనమలూరు, జులై 2 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, జి రామ్ జి విక్షిత్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించడం వల్ల దేశంలో గ్రామాలని అభివృద్ధి పదం వైపు వెళ్తాయని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గురువారం పెనమలూరు నియోజక వర్గ పరిధిలోని గంగూరు గ్రామంలో వికసిత్ భారత్ కార్యాలయంలో మొక్కలు నాటిన అనంతరం మాట్లాడుతూ గతంలో ఎన్.ఆర్. జివిస్ నిధులు అత్యధికంగా మన రాష్ట్రం ఉపయోగించుకొని అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.వికసిత్ భారత్ 2047 లక్ష్యసాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.దేశంలో, మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ సేవల విస్తరణ, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, రైతు సంక్షేమం, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవల అందుబాటు వంటి అనేక రంగాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేస్తాయన్నారు.వికసిత్ భారత్--2047 కేవలం ప్రభుత్వ లక్ష్యం మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతో సాధించాల్సిన జాతీయ సంకల్పమని ఆయన అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో యువత, మహిళలు, రైతులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు చురుకుగా పాల్గొని దేశ ప్రగతికి తోడ్పడాలని కోరారు. దేశ ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, అదే స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మారుపూడి ధన కోటేశ్వరరావు, కోయ ఆనందప్రసాద్, ప్యారి లతీఫ్ అక్బర్ భాష అబ్దుల్ సలాం అబ్దుల్ గౌస్ నందేటి కోటయ్య సంగపు రంగారావు. మండల పరిషత్ అధికారి అన్నపూర్ణాదేవి గారు విజయ రాజు, ఓంకార్, పంచాయతీ సెక్రెటరీ ప్రకాశరావు ఎనర్ జెసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పెద్దగుండాలమ్మ ఆలయంలో విశేష పూజలు



పులిచెర్ల, జూలై 2 (నేటి శుభోదయం): చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం భీమవరం--కొత్తపేట రహదారిలో వెలసిన శ్రీ పెద్ద గుండాలమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని విశేష పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## బీఎల్ఏలే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి వెన్నెముక..!!

**- గ్రామ స్థాయి నుంచి ప్రజా ఉద్యమాలను విస్తరించాలి- బీఎల్ఏల విస్తృత స్థాయి సమావేశంలో ఏపీ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిపెంట శాంతకుమారి పిలుపు**



( నేటి శుభోదయ జులై :03 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విజయనగరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) విస్తృత స్థాయి సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిపెంట శాంతకుమారి పాల్గొన్నారు. సమావేశానికి ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ పాలక్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ పాలక్ వర్మ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణలో బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకోకుండా ప్రతి బూత్ స్థాయిలో కాంగ్రెస్ నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిపెంట శాంతకుమారి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు. ప్రజల్లోకి వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలని, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, గిరిజన హక్కుల పరిరక్షణ, మహిళల భద్రత, విద్యా వ్యవస్థలో నెలకొన్న సంక్షోభం వంటి ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థలో పేపర్ లీకేజీలు వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని, యువతలో పెరుగుతున్న నిరాశకు ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేపడుతున్న ప్రజా ఉద్యమాలకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అండగా నిలవాలని పిలుపునిస్తూ, ప్రజలు నేరుగా ఉద్యమాల్లో భాగస్వాములు కావడానికి రూపొందించిన ప్రత్యేక క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేశారు.అనంతరం బీఎల్ఏలకు ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల తొలగింపులపై అభ్యంతరాలు నమోదు చేసే విధానం, బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం. విద్యాసాగర్, జిల్లా, మండల, నగర కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామ, వార్డు లను ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర డైరెక్టర్ శివప్రసాద్



బాపట్ల నేటి శుభోదయజులై 2 :బాపట్ల మండలం లోని అప్పికట్ల, ఈస్ట్ బాపట్ల స్వర్ణ గ్రామాలను, అర్బన్ పరిధి లోని ప్యాడిసన్ పేట,బేతని కాలనీ స్వర్ణ వార్డు లను గురువారం ఎస్.జి.ఎస్.డబ్ల్యు శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఎం.శివప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగులు ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రజల మెప్పు పొందే విధంగా ఉద్యోగులు తమ పని తీరును ఇంకా మెరుగు పరుచుకోవాలని సిబ్బంది కి సూచించారు.సేవలు పై ప్రజల అభిప్రాయాలను, సంతృప్తి ని వ్యక్త పరిచే ఫీడ్ బ్యాక్ రిజిస్టర్లను ప్రతి ఆఫీసు లో నిర్వహించాలని, తల్లి కి వందనం నగదు ను తల్లుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నందున సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా అర్హులైన అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, సంక్షేమ పథకాలను పొందేందుకు వీలుగా ఇకేవైసి, మన మిత్ర వాట్సాప్ ద్వారా అన్ని రకాల ఆన్ లైన్ సేవలు పారదర్శకంగా పౌరులకు అందించేందుకు కృషి చేయాలని ఉద్యోగులను ఆదేశించారు.అన్నిరకాల రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు,కార్యాలయ పరిశుభ్రత పట్ల డైరెక్టర్ శివప్రసాద్ సంతృప్తి వ్యక్తం చేశారు.ఈస్ట్ బాపట్ల లోని ఆధార్ నమోదు కేంద్రం లో అందుతున్న సేవలను ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బంది ని అభినందించారు. ఆఫీస్ ప్రాంగణంలో మొక్క ను నాటారు.డైరెక్టర్ పర్యటన లో బాపట్ల జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి ఎస్.రాజేష్ , జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, బాపట్ల మండల స్వర్ణ గ్రామ అధికారి పల్నాటి శ్రీరాములు, అర్బన్ స్వర్ణ వార్డు అధికారిణి రాధా పాల్గొన్నారు.అనంతరం చీరాల అర్బన్ పరిధి లోని గొల్లపాలెం 1, 2 వార్డు కార్యాలయాలను కూడా డైరెక్టర్ సందర్శించారు. డైరెక్టర్ తో పాటు చీరాల అర్బన్ స్వర్ణ వార్డు అధికారి ఉమాశంకరరావు, స్వర్ణ గ్రామ అధికారి శ్రీనివాసులు వున్నారు.చీరాల పురపాలక సంఘం సమావేశ మందిరంలో బాపట్ల జిల్లా లోని ఎం.ఎస్.జీ.వోలు,యు.ఎస్.డబ్ల్యు.వో లతో సమీక్ష నిర్వహించారు.బాపట్ల డి.డి.వో. విజయలక్ష్మి, చీరాల డి.డి.వో. పద్మావతి, అడిషనల్ కోఆర్డినేటర్ విజయ్, ఆధార్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్ పాల్గొన్నారు.

# తేలప్రోలులో వీబీ గ్రామ్‌జీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

**-ఉపాధి హామీ పనిదినాలు 100 నుంచి 125 రోజులకు పెంపు స్వాగతించదగ్గ నిర్ణయం: యార్లగడ్డ**



గన్నవరం, జులై 2 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వికసిత్ భారత్ గ్రామీణ్ రోజ్‌గార్ అజీవిక మిషన్ గ్రామీణ్ కార్యక్రమాన్ని గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు మండలం తేలప్రోలులో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గురువారం ప్రారంభించారు. రైతులు, ఉపాధి హామీ కూలీలతో కలిసి పంట కాలువలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే వీబీ గ్రామ్‌జీ లక్ష్యమన్నారు. గతంలో 100 రోజులుగా ఉన్న ఉపాధి హామీ పనిదినాలను కేంద్ర ప్రభుత్వం 125 రోజులకు పెంచడం రైతులు, కూలీలకు ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. అలాగే రోజువారీ కూలీని రూ.307 నుంచి రూ.312కు పెంచడం కూడా స్వాగతించదగ్గ నిర్ణయమన్నారు. గతంలో రైతులే తపిరీలు వేసుకుని పంటబోదులు, కాలువలు, గట్లు సంరక్షించుకునే పరిస్థితి ఉండేదని, కాలక్రమేణా కౌలు వ్యవస్థ పెరగడంతో ఆ పద్ధతి తగ్గిపోయిందన్నారు. దీంతో పంటబోదులు, కాలువలు పూడిపోవడంతో పాటు గట్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. పొలం ఎవరిదైతే వారే బాధ్యతగా సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, పాత వ్యవసాయ విధానాలు తిరిగి రావాలని వ్యక్తిగతంగా కోరుకుంటున్నానన్నారు. తిరుపతిలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో వీబీ గ్రామ్‌జీ కార్యక్రమాన్ని ప్రారంభించడం, అందుకు ఆంధ్రప్రదేశ్ వేదిక కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఎస్సీ కాలనీ రహదారి సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో రూ.10 లక్షలతో నెల రోజుల్లో రహదారి నిర్మించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే గ్రామంలోని కచ్చా డ్రెయినేజీ సమస్యను వారం రోజుల్లో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో మట్టి అక్రమ తవ్వకాలు, అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించిన ఎమ్మెల్యే, ప్రస్తుతం గన్నవరం నియోజకవర్గంలో మట్టి అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేసినట్లు తెలిపారు. అనేక గ్రామాల్లో ఇళ్ల స్థలాల మెరక పనులు చేపట్టి లబ్ధిదారులకు ఉచితంగా మట్టి అందించామని చెప్పారు. త్వరలో గన్నవరంలో ఏఐ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, అలాగే సీఎస్ఆర్ నిధులతో రూ.4.50 కోట్ల వ్యయంతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి పనులు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఇంటింటికీ వెళ్లి రక్తపరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని గన్నవరం నియోజకవర్గంలో అమలు చేస్తున్నామని తెలిపారు. గన్నవరం పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ప్రస్తుతం నియోజకవర్గమంతటా విస్తరించి, ఇప్పటివరకు 60 వేల మందికి పైగా రక్తపరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వం వద్ద నిధుల కొరత ఉన్న చోట సీఎస్ఆర్ నిధులను సమీకరించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గన్నవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఒకటి, రెండు రోజుల్లో పీఏసీఎస్ అధ్యక్షులు, బ్యాంకు ఛైర్మన్లు, వ్యవసాయ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి ప్రతి రైతుకు అవసరమైన మేర ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో కొంతమంది రైతులు అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేయడంతో చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఈసారి అలాంటి పరిస్థితి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, మండల టీడీపీ అధ్యక్షులు కొలుసు రవీంద్ర, ప్రధాన కార్యదర్శి కుందేటి చంద్రశేఖర్, తేలప్రోలు గ్రామ పి.ఏ.సి.ఎస్ చైర్మన్ ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, అలుగోజి నాగబాబు, బీమవరపు జైపాల్ రెడ్డి, యూనిట్ కన్వీనర్ దొడ్ల కుమార్, బెజవాడ నాగేశ్వరరావు, ఉయ్యూరు మురళి, పోతినేని రామకృష్ణ, మేడేపల్లి రమ, కొసరాజు సాయిరాం, ఇందుపల్లి యోహాను, లంక సత్తిరాజు, నూనె అరుణ్, సుంకర రాజేంద్రప్రసాద్, నక్కా వెంకటేశ్వరరావు, సాళ్ళూరి సుధాకర్, కాటం చౌదరి, శనగల శేఖర్ రెడ్డి, గాదిరెడ్డి మోహన్ రెడ్డి, యంగ్ ప్రొఫెషనల్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలి: ఎంవీఐ రంగారావు



బాపట్ల నేటి శుభోదయజులై 2:బాపట్ల ప్యాడిసన్‌పేట ఎన్‌టీఆర్ కాలనీ వద్ద మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డీబీవీ రంగారావు గురువారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, బీమా ధ్రువపత్రాలను పరిశీలించారు. ప్రతి వాహనదారుడు అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని బాపట్ల ఆర్డిఓ హరికుమార్.



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్)జులై 2:బాపట్ల పట్టణం 96వ పోలింగ్ బూత్ పరిధిలో సర్ కార్యక్రమం జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించి బిఎల్ఓ పనితీరు సరిగా లేకపోవడంతో బిఎల్ఓపై అగ్రహం వ్యక్తం చేశారు. బిఎల్వోలు ప్రతి ఇంటికి తిరిగి పత్రాలను ఓటర్లకు అందజేసి పూర్తి చేసిన అనంతరం తీసుకొని తప్పులు లేకుండా సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు.

## బాధితులకు నష్ట పరిహారం చెక్కులు పంపిణీ..!!



( నేటి శుభోదయ జులై : 03 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) న్ ఎ డి నుంచి విమానాశ్రయానికి వెళ్ళే దారిలో కాకాని నగర్ మరియు నావెల్ ఆర్మమెంట్ డిపో వద్ద సుమారు 12.50 కోట్ల రూపాయల నిధులతో వి ఎం ఆర్ డి ఏ నిర్మించ తలపెట్టిన అండర్ పాస్ నిర్మాణంలో ప్రభావితమవుతున్న కట్టడాల యజమానులకు గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ గణబాబు, వి ఎం ఆర్ డి ఎ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ ఎన్ తేజ్ భరత్ నష్ట పరిహారం చెక్కులు అందజేశారు. వి ఎం ఆర్ డి ఎ తరుపున మొత్తం 16 కట్టడాలకు చెందిన యజమానులకు రూ.22.98 లక్షల మేర నష్ట పరిహారం చెక్కులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ గణబాబు మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ తేజ్ భరత్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణబాబు మాట్లాడుతూ నిత్యం అత్యంత రద్దీగా ఉండే ప్రాంతమైన కాకాని నగర్ మరియు నావెల్ ఆర్మమెంట్ డిపోల వద్ద ప్రతిపాదిత అండర్ పాస్ నిర్మాణం వల్ల సమీప ప్రాంత ప్రజలకు సిగ్నల్ రహిత ప్రయాణ సౌలభ్యం అందుబాటులోకి వస్తుందని, దీని ద్వారా ఎంతో వెసులబాటు కలుగుతుందని అన్నారు. ఈ అండర్ పాస్ పనులకు నిధులు మంజూరు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఛైర్పర్సన్ శ్రీ ఎంవి ప్రణవ్ గోపాల్ మరియు మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ ఎన్ తేజ్ భరత్ ఈ ప్రాంత ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. . మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ తేజ్ భరత్ మాట్లాడుతు గణబాబు నిరంతర కృషి వల్లే అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ అండర్ పాస్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. న్ హెచ్ ఏ ఐ స్టాండర్డ్స్ కి అనుగుణంగా ప్రతిపాదిత మెట్రో ప్రాజెక్టు అలైన్మెంట్ కు లోబడి ఈ అండర్ పాస్ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీరు మధుసూదనరావు, సహాయక ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారి నిత్యాన్నదాన పధకానికి విరాళం అందజేత



విజయవాడ, జూలై 2(నేటి శుభోదయ):- తెలంగాణ లోని కరీంనగర్ జిల్లాకు చెందిన సింగీతం నాగమణి శ్రీ కనకదుర్గమ్మ వారి నిత్యాన్నదాన పధకానికి 2,00,000/- విరాళాన్ని సంబంధిత ఆలయ అధికారులు, అర్చకుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతకు అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితులు వేదాశీర్వాదాన్ని అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

## వెస్ట్ జోన్ లో జూలై 15న బహిరంగ వేలం నిర్వహణ..!!

**- జివిఎంసి జోనల్ కమిషనర్ బి . హేమావతి**



( నేటి శుభోదయ జులై : 03 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ వెస్ట్ జోన్ పరిధిలోని ఖాళీగా ఉన్న దుకాణాలు, కళ్యాణ మండపాలు, రోడ్ సైడ్ మార్కెట్లకు జూలై 15వ తేదీన ఉదయం 11 గంటలకు వెస్ట్ జోన్ జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని జోనల్ కమిషనర్ బి. హేమావతి గురువారం ఒక ప్రకటన లో తెలియజేశారు. వార్డు నెం.60 లో గుల్లల పాలెం షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణము నెం.12,16,23,24,25,26,33,41,46,47 మరియు 57, ములగాడ షాపింగ్ కాంప్లెక్సు లో దుకాణము నెం.03 , ప్రకాష్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణము నెం.05 , గుల్లల పాలెం హాకర్ జోన్ షాప్ లో బ్లాక్-ఎ లో 8,14,18 & 19 మరియు బ్లాక్-బి లో 21,22,23,24,25, 26,27,28,29,30,31,32,33,34,35,36,37,38 షాప్ లకు మూడు సంవత్సరాల కాల పరిమితి కి మరియు మార్కెట్లలో గుల్లలపాలెం దుకాణము రోడ్ పక్కన మార్కెట్లకు (హాకర్ మండలం) లకు ఒక సంవత్సరం కాల పరిమితి కి గుత్త కు ఇచ్చుటకు తేది 15-07-2026 ఉ.గం. 11 లకు వేలం పాట జరుగునని వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ తెలిపారు. కావున ఆసక్తి గల వారు వేలంపాటకు సంబంధించి ధరావత్తు మొత్తం డి.డి రూపంలో తీసుకురావాలని, ఎస్.సి రిజర్వుడు కేటగిరి వారు సంబంధిత కుల ధృవీకరణ పత్రం సమర్పించవలసి ఉంటుందని, వేలం పాటలో పాల్గొనే ప్రతి ఒక్కరు ఆధార్, పాన్ కార్డు కలిగి ఉండాలని, తదుపరి పూర్తి వివరణ కొరకు వెస్ట్ జోన్ కార్యాలయము పని దినములలో పర్యవేక్షకులను సంప్రదించవచ్చునని జోనల్ కమిషనర్ తెలియజేశారు..

## బాపట్ల పట్టణ వార్డుల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించిన కమిషనర్ యం.హాసిని



బాపట్ల నేటి శుభోదయ జూలై 2 : కమిషనర్ యం.హాసిని ఈరోజు ఉదయం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా వార్డుల్లో రోడ్ల శుభ్రత, కాలువల పరిశుభ్రత, చెత్త సేకరణ తదితర పారిశుద్ధ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికులు, సంబంధిత సిబ్బందితో మాట్లాడి వారు ప్రతిరోజూ నిర్వహిస్తున్న పనులు, హాజరు, విధుల నిర్వహణ గురించి వివరాలు తెలుసుకున్నారు.ప్రతి వార్డులో నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పారిశుధ్య పనులు చేపట్టాలని, ఇంటింటి చెత్త సేకరణను సమయానికి పూర్తి చేయాలని, రోడ్లు, కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.అనంతరం అన్నక్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్ అక్కడ నిర్వహిస్తున్న రికార్డులు, హాజరు నమోదులు మరియు ఇతర సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. అన్న క్యాంటీన్‌కు వచ్చే లబ్ధిదారులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.వారి వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ చేవూరి కరుణ మరియు పురపాలక సంఘ సిబ్బంది ఉన్నారు.

## బుడమేరులో గుర్రపుడెక్కలు తొలగింపు




విజయవాడ, జూలై 2(నేటి శుభోదయ):- వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని బుడమేరు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు, గుర్రపుడెక్క తొలగింపు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.గురువారం ఉదయం సర్కిల్-2 పరిధిలోని 30వ డివిజన్ రామకృష్ణపురం వద్ద బుడమేరు కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, గుర్రపుడెక్కను తొలగించేందుకు లాంగ్ ఆర్మ్, ట్రక్సర్, బోట్లను వినియోగిస్తూ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టారు.వర్షాకాలంలో కాలువల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, జల మొక్కలను పూర్తిస్థాయిలో తొలగించడం ద్వారా నీటి ప్రవాహం మెరుగుపడి, వరద ముప్పు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.నగరంలోని ప్రధాన కాలువలు, డ్రైన్లు, అవుట్‌ఫాల్ డ్రైన్లలో ఇలాంటి ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను కాలువల్లో వేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నగరవ్యాప్తంగా తాగునీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ



విజయవాడ, జూలై 2(నేటి శుభోదయ):- నగర ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా విజయవాడ నగరపాలక సంస్థ నగరవ్యాప్తంగా తాగునీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.గురువారం నగరంలోని అన్ని సర్కిళ్లు, డివిజన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థ నుంచి నీటి నమూనాలను సేకరించి రెసిడ్యువల్ క్లోరిన్ (ఆర్‌సీ) పరీక్షలను నిర్వహించారు. తాగునీటిలో నిర్దేశిత స్థాయిలో క్లోరిన్ ఉండేలా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. తాగునీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా క్లోరిన్ స్థాయిలు తక్కువగా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే అదనపు క్లోరినేషన్ నిర్వహించి తాగునీటి నాణ్యతను మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు.తాగునీటి నాణ్యతను పర్యవేక్షించేందుకు నగరవ్యాప్తంగా ఆర్‌సీ పరీక్షలను ప్రతిరోజూ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని, అవసరమైన చోట్ల నీటి నమూనాలను ప్రయోగశాలలకు పంపించి నాణ్యత పరీక్షలు కూడా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు తాగునీటిని పరిశుభ్రమైన పాత్రల్లో నిల్వ చేసుకోవాలని, నీటి వృథాను నివారించాలని, కమిషనర్ ధ్యానచంద్ర విజ్ఞప్తి చేశారు.

## ఏ ఈ ఆర్ వో లు, సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలపై దిశానిర్దేశం ఇవ్వాలి



విజయవాడ, జూలై 2(నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం సాయంత్రం లక్ష్మీ నగర్ కాలనీ , ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం లో ఏర్పాటుచేసిన సెంట్రల్ నియోజకవర్గం కంట్రోల్ రూమ్ లో, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ా×=) కార్యక్రమం పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్ల (దీూలు)తో నేరుగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటి, వాటికి పరిష్కార మార్గాలు ఏవి అనే అంశాలపై వారితో చర్చించి తగిన సూచనలు, సలహాలు అందించారు.ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ సమర్థవంతంగా పనిచేస్తేనే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా విజయవంతంగా పూర్తి చేయడం సాధ్యమవుతుందని కమిషనర్ పేర్కొన్నారు. ఏఈఆర్వోలు తమ పరిధిలోని దీూలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, వారు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే గుర్తించి, అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దీూకు అవసరమైన సహకారం అందిస్తూ, ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా, వేగవంతంగా పూర్తి చేసేలా పర్యవేక్షణ నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటుచేసిన సెంట్రల్ నియోజకవర్గం కంట్రోల్ రూమ్ లో బూత్ లెవెల్ ఆఫీసర్లు ఎన్యుమరేషన్ ఫోరముల మ్యాపింగ్, డిజిటలైజేషన్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ వేగంగా కొనసాగుతోందని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. గురువారం సాయంత్రం 4.00 గంటల వరకు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 2,77,822 మంది ఓటర్లకు గాను 2,70,004 మందికి (97.19%) ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, వాటిలో 63,894 ఫారాలు (23.00%) డిజిటైజేషన్ పూర్తయిందన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 2,56,980 మంది ఓటర్లకు గాను 2,51,087 మందికి (97.71%) ఫారాలు పంపిణీ చేసి, 53,503 ఫారాలు (20.82%) డిజిటైజేషన్ చేసినట్లు తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 2,69,734 మంది ఓటర్లకు గాను 2,63,563 మందికి (97.71%) ఫారాలు పంపిణీ చేయగా, 68,261 ఫారాలు (25.31%) డిజిటైజేషన్ పూర్తయిందన్నారు. మిగిలిన ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియలను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ాూజు=ాలు, దీూలు, దీూ సూపర్వైజర్లకు కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్రమం లో చీఫ్ సిటీ ప్లానర్, ఏఈఆర్ఓ కె. సంజయ్ రత్నకుమార్, ఎలక్షన్ డి టీ యస్. సురేష్ కుమార్, సిడిఓ జగదీశ్వరి, బిఎల్వోలు పాల్గొన్నారు.

## డాక్టర్ కందుల సేవలకు నీరాజనం..!!

**– ప్రజల నుంచి అనూహ్య స్పందన– ప్రజా నేతకు జేజేలు కొడుతున్న జనం**



( నేటి శుభోదయ జులై : 03 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) జనం మెచ్చిన నాయకులు డాక్టర్ కందుల నాగరాజు కె ఎన్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్య క్రమాలకు శ్రీకారం చుట్టి, ఎంతోమంది జీవితాలలో వెలుగులు నింపారు కార్పొ రేటర్ గా కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపి 32వ వార్డును మోడల్ వార్డుగా తీర్చి దిద్దారు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ గా కూడా అటు ఆలయ అభి వృద్ధికి కృషి చేస్తూనే భక్తుల కు మెరుగైన సౌకర్యాల కల్పనకు అహర్నిశలు శ్రమి స్తున్నారు ఆయన సేవలు ఒక్క 32వ వార్డుకు మాత్రమే పరిమితం కాకుండా దక్షిణ నియోజకవర్గం మొత్తం విస్త రించాయి తాను నిర్విరామం గా చేస్తున్న సేవా కార్య క్రమాలలో భాగంగా అల్లి పురం నేరాలు-కోనేరుల గల తన కార్యాలయంలో 34వ వార్డు కొబ్బరి తోట ప్రాంతా నికి చెందిన నవవధువు శ్రీవల్లిక కు జాతీయ జర్న లిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబుతో కలిసి బంగారు తాళిబొట్టు,పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమ అందజేశారు ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని చెప్పారు ఆ పార్వతీ పర మేశ్వరుల ఆశీస్సులతో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి అనుగ్రహంతో మరిన్ని కార్య క్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని వెల్లడించారుసాధ్యమైన మేర ఇతరులకు మంచి చేయడానికి తాను ఎప్పుడు వెనకాడనని చెప్పారు ప్రతి ఒక్కరిలో తాను ఆ భగవంతుని చూస్తున్నట్లు తెలిపారు24 గంటలు ప్రజలకు తను అందుబాటులో ఉంటూ ఎవరికి ఏ సమస్య వచ్చినా ఆ సమస్యను పరిష్కరిం చేందుకు ముందుంటానని చెప్పారు ప్రజా సమస్యల పరిష్కారంలో తాను ఎప్పటికీ రాజీ పడనని పేర్కొన్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తి, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ సహకారంతో తాను మరిన్ని కార్యక్రమాల కు ముందడుగు వేస్తున్నట్లు చెప్పారు ఎవరికి ఎటువంటి కష్టం వచ్చినా సమస్య వచ్చిన తనను నేరుగా గాని ఫోన్ ద్వారా గాని సంప్ర దించాలని పేర్కొన్నారుప్రజల మంచి కోసం తాను ఏది చేయడానికి సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు ఈ కార్యక్రమంలో కే.కృష్ణ, అప్పారావు,జానకి,హేమ తదితరులు పాల్గొన్నారు.

## 120 ఏళ్ల పురాతన శివాలయంలో లక్ష్మీ గణపతి, దక్షిణామూర్తి విగ్రహాల ప్రతిష్ఠ

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాద్**



విజయవాడ, జూలై 2(నేటి శుభోదయ):- గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలోని 120 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన పురాతన శివాలయంలో శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ దక్షిణామూర్తి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని) పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ దక్షిణామూర్తుల అనుగ్రహంతో విజయవాడ పార్లమెంట్ పరిధి ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఈ దివ్య విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా భక్తులకు మరింత ఆధ్యాత్మిక అనుభూతి, దైవదర్శన భాగ్యం కలిగే అవకాశం ఏర్పడిందన్నారు.ఆలయ అభివృద్ధికి కృషి చేస్తూ లక్ష్మీ గణపతి, దక్షిణామూర్తి విగ్రహాల ప్రతిష్ఠకు సహకరించిన ఆలయ కమిటీ సభ్యులు, దాతలను ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. వారి సేవాభావం ఆలయ వైభవాన్ని మరింత పెంచిందని కొనియాడారు.అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఎంపీ కేశినేని చిన్ని కి వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని లక్ష్మీ గణపతి, దక్షిణామూర్తుల దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజర్ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, మాజీ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, ఈవో యడ్లపల్లి సీతారామయ్య, బత్తుల కొండ, దేవరపు మాల్యాద్రి,కొంపల్లి నాని, గార్లపాటి విజయ్ కుమార్, పైడి తులసి ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఆపదలో అండగా.. అనారోగ్య బాధితులకు భరోసాగా సీఎంఆర్ఎఫ్

**విజయవాడ పార్లమెంట్ పరిధి లో 32.40 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన ఎంపీ చిన్ని**



విజయవాడ, జూలై 2(నేటి శుభోదయ):- విజయవాడ ప్రజల కష్టాల్లో ప్రభుత్వం అండగా నిలవాలనే సంకల్పంతో అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నిజమైన ఆపద్బాంధవుడిగా మారిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వైద్య ఖర్చులు భరించలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందుతున్న సాయం వారి జీవితాల్లో కొత్త ఆశలు నింపుతోందన్నారు.గురువారం విజయవాడ పార్లమెంట్ పరిధిలోని విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలతో పాటు తిరువూరు నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ.32,40,252 విలువ గల

### 61 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను

ఎంపీ చిన్ని కార్యాలయంలో పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరిస్తున్న చిన్ని మరోసారి ప్రజల ప్రశంసలు అందుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ"అనారోగ్యం ఒక్క కుటుంబాన్నే కాదనీ,ఆ కుటుంబ ఆర్థిక వ్యవస్థనే కుదేలు చేస్తుందని అలాంటి క్లిష్ట సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద భరోసాగా నిలుస్తోందన్నారు. డబ్బులేవని ఎవరి వైద్య చికిత్స ఆగిపోకూడదన్నదే తమప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకం వారి గడప వరకూ చేరేలా ప్రజాప్రతినిధిగా తన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తాను" అని స్పష్టం చేశారు.మండలాల వారీగా పంపిణీ చేసిన చెక్కుల వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ మండలంలో 8 మందికి 8,55,118, ఎ.కొండూరు మండలంలో 6 గురికి 3,50,665, గంపలగూడెం మండలంలో 25 మందికి 10,40,232, విస్సన్నపేట మండలంలో 11 మందికి 3,55,619, తిరువూరు మండలంలో 12 మందికి 7,17,618 విలువైన చెక్కులను అందజేశారు. మొత్తంగా 61 మంది లబ్ధిదారులకు రూ.32,40,252 ఆర్థిక సహాయాన్ని అందించారు.సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు భావోద్వేగానికి లోనయ్యారు. క్లిష్ట సమయంలో ప్రభుత్వం అందించిన ఈ సాయం తమకు ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొంటూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విజయవాడ ఎంపీ చిన్ని పట్ల కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల కష్టాన్ని తన బాధగా భావిస్తూ,ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయాలనే లక్ష్యంతో ఎంపీ నిరంతరం కృషి చేస్తుండటం విజయవాడ పార్లమెంట్ పరిధిలో ప్రజలకు మరింత భరోసాను కల్పిస్తోంది.

## ప్రజారోగ్యానికే ప్రాధాన్యం. పాత ప్రభుత్వాసుపత్రి లో నూతన క్రిటికల్ కేర్ భవనలు ఏర్పాటు.

**9న కేంద్ర మంత్రి జెపి నడ్డా తో కలిసి ప్రారంభోత్సవం. ఎంపి కేశినేని చిన్ని**



విజయవాడ, జూలై 2(నేటి శుభోదయ):-విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక సదుపాయాలతో రూపుదిద్దుకుంటున్న క్రిటికల్ కేర్ నూతన భవనాలను ఎంపి కేశినేని శివనాథ్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. నిర్మాణ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులు, ఇంజినీర్ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ ఈ నెల 9న కేంద్ర మంత్రి జెపి నడ్డా తో కలిసి నూతన భవనాలను ప్రజలకు అంకితం చేయనున్నట్లు ఎంపీ ప్రకటించారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో సిద్ధమవుతున్న ఈ భవనాలు విజయవాడతో పాటు పరిసర జిల్లాల ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో కీలకంగా నిలుస్తాయని తెలిపారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బందితో ఎంపీ చర్చించి, వైద్య సేవల నిర్వహణ, అవసరమైన మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి కుటుంబ సభ్యులతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకుని, ఇంకా అవసరమైన సదుపాయాలపై సూచనలు స్వీకరించారు.ఆసుపత్రి సూపరిండెంట్ ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రజలు కోసం వెయిటింగ్ హాల్స్ ను అడిగితే స్వయం గా ఎంపీ నిధులతో రెండు వెయిటింగ్ హాల్స్ నిర్మాణం చేసి ఇస్తానని హామీ ఇచ్చారు ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని పేర్కొన్న ఎంపీ చిన్ని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవాభావంతో విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు.అత్యాధునిక వైద్య పరికరాలు, విశాలమైన వార్డులు, మెరుగైన మౌలిక వసతులతో సిద్ధమవుతున్న నూతన భవనాలు అందుబాటులోకి వస్తే విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి సేవలు మరింత విస్తరించి వేలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరనుందని అధికారులు తెలిపారు.

## "కార్మికోద్యమాన్ని విస్తరించి బలోపేతం చేయాలి!

**ఎఐటియుసి నేతల పిలుపు"**



తాడేపల్లిగూడెం జులై 2 (అవినాష్ మారంపూడి నేటి-శుభోదయ)::: కార్మికోద్యమాన్ని మరింతగా విస్తరింప చేసి సంస్థాగతంగా బలోపేతం చేయడం ద్వారానే కార్మిక హక్కులను కాపాడు కోగలమని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి సోమసుందర్ పిలుపు ఇచ్చారు.ఎఐటియుసి తాడేపల్లిగూడెం ఏరియా సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం స్థానిక సిపాయిపేట భవన నిర్మాణ కార్మికసంఘం కార్యాలయంలో జరిగింది. ఏరియా సమితి అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు అధ్యక్షత వహించారు.వీర్రాజు మాట్లాడుతూ లేబర్ కోడ్లు అమలులోకి వచ్చిన తర్వాత కార్మికుల పరిస్థితి మరింతగా దిగజారిందని అన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఉన్న కొద్దిపాటి ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడిందని , మరిన్ని పోరాటాల ద్వారానే కార్మిక హక్కులను కాపాడుకోగలమని అన్నారు.డి. సోమసుందర్ మాట్లాడుతూ పాలకవర్గాలు కార్మికవర్గాన్ని అణచివేయడానికి , కార్మికోద్యమాన్ని నీరు కార్చడానికి గట్టి ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. సమస్యలపై తక్షణ పోరాటాలకు పూనుకోవాలని, కార్మిక సంఘాలను మరింతగా బలోపేతం చేయాలని , కార్మిక సంఘాలను, రికార్డులను, సక్రమంగా నిర్వహించుకోవాలని అన్నారు. దేశంలో మారిన కార్మిక చట్టాల స్వరూప స్వభావాలపై సభ్యులకు అవగాహన కల్పించాలని సోమసుందర్ కోరారు. ఏరియా సమితి కార్యదర్శి మందలపర్తి హరీష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎఐటియుసి ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని, పోరాటాల్లో కార్మికుల భాగస్వామ్యాన్ని అధికంగా పెంచాలని కోరారు, కార్మిక జీవితాలు మెరుగుపడాలంటే కార్మికోద్యమం పటిష్టంగా ఉండాలని నొక్కి చెప్పారు. సమావేశంలో ఏరియా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు, కార్యనిర్వాహక కార్యదర్శి కే.లక్ష్మీనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తాడికొండ శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ , యూనియన్ నాయకులు కోడె సాయి బాలాజీ, మాదాసు సత్యనారాయణ, మేళం నాగరాజు, టి. కృష్ణంరాజు, యాళ్ళ శ్రీనివాస్, సత్తిశెట్టి అప్పలరాజు, బి.రామ్మోహన్, కొడమంచిలి చంద్రరావు, మార్లపూడి కాటమరాజు , కోటుం నాగేశ్వరరావు, ఎ వెంకటలక్ష్మి, తదితరులు మాట్లాడారు.మున్సిపల్ కార్మికుల చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, మెడికల్ , ఆటో , హమాలీ , భవన నిర్మాణ రంగాల్లో చేపట్టిన ఉద్యమాలను జయప్రదం చేయాలని సమావేశం నిర్ణయించింది.

## లోపాలు లేని ఓటరు జాబితా 'సర్' తోనే ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, జూలై 2(నేటి శుభోదయ):-లోపాలు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం దోహదం చేస్తోందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. గురువారం ఉదయం తూర్పు లోని 18వ డివిజన్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం తీరును ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ప్రభుత్వం 'సర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఓటరు జాబితాలో ఉన్న లోపాలను సరిచేసి సక్రమమైన ఓటరు జాబితాను రూపొందించడానికి ఈ 'సర్' కార్యక్రమంలో ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. లోపాలు లేని ఓటరు జాబితా ద్వారానే ఎన్నికల్లో నిజమైన ప్రజాభిప్రాయం స్పష్టంగా తెలుస్తోందని, అందువల్ల వివరాల సేకరణ కోసం ఇంటికి వచ్చిన బీఎల్‌వోకు సమగ్రంగా వివరాలు అందచేసి ప్రజలు సహకరించాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, కొక్కిరి తిరుపతయ్య, వేముల దుర్గారావు, రాయి రంగమ్మ, గోగుల ఏసుబాబ, ముని కృష్ణ, సిద్ధం నాగేంద్ర రెడ్డి, గోగుల గోపి, వేజర్ల కాశీ, వేల్పుల శౌరి, ముని పోలిపల్లి, గంద్ర రాజు, మొకర ఆదిబాబు, వేముల తారక్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ వైఖరితో అధః పాతాళానికి వైఎస్సార్‌సీపీ

**యువత భవిష్యత్తు అయిన అమరావతిపై కుట్రలు చేయడం సరికాదు ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, జూలై 2(నేటి శుభోదయ):-అమరావతిపై వైఎస్.జగన్ చేసిన వ్యాఖ్యలతో వైఎస్సార్‌సీపీ మరింత అధఃపాతాళానికి చేరుకుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. గురువారం ఉదయం తూర్పు లోని 18వ డివిజన్ రాణిగారితోట నాలుగు రోడ్ల సెంటర్‌లో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 60 మందికి మంజూరైన 83 లక్షల విలువైన చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు.ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల వ్యవధిలో ప్రతి నెలా రెండు సార్లు సభలను నిర్వహించి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ వైద్యసేవ, ఫించన్ల పంపిణీ వంటి పథకాలను ప్రవేశపెట్టడమే కాకుండా సమర్థవంతంగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చరిత్ర సృష్టించారని చెప్పారు. ఎన్టీఆర్ వైద్య సేవకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల వ్యవధిలోనే రూ.ఏడు వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. వైఎస్.జగన్ హయాంలో ఆరోగ్యశ్రీకి ఐదు సంవత్సరాల కాలంలో కేవలం 9వేల కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వానికి ఇంకా మూడు సంవత్సరాల వ్యవధి ఉందన్నారు. ఒక్క తూర్పు నియోజకవర్గంలోనే ఇప్పటి వరకు సీఎంఆర్ఎఫ్‌లో భాగంగా 16 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందచేశామన్నారు. ప్రజలకు అవాస్తవాలను చెప్పి ప్రజలను మభ్యపెట్టి లబ్ధి పొందాలని వైఎస్సార్‌సీపీ నాయకులు చూస్తున్నారని, గత ఎన్నికల్లో అదే చేసి విజయం సాధించి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా దిగజార్చారని గద్దె అన్నారు. వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎప్పుడూ వాస్తవాలు చెప్పడం లేదన్నారు. మావిగన్‌కు మద్దతు ఇచ్చేవారు వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని, అమరావతికి మద్దతు ఇచ్చే వారు టీడీపీ ఓట్లు వేయాలని జగన్ ప్రకటించి తమకు చాలా మేలు చేశారని ఎమ్మెల్యే గద్దె అన్నారు. అమరావతికి తమ పార్టీ ఎల్లప్పుడు వ్యతిరేకం కాదని వైఎస్సార్‌సీపీ నాయకులు సోషల్ మీడియాలో చెబుతున్నారని, అంటే వైసీపీ నాయకుల మతిస్తిమితం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. క్యాపిటల్ గురించి అసలు రాజ్యాంగంలోనే లేదని జగన్ చెబుతున్నాడని, జగన్ మాటలపై ఆ పార్టీ నాయకులే ఆలోచనలు చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భవిష్యత్తును ఊహించి చెబుతారని, ఆయన చెప్పినట్లే కొన్ని సంవత్సరాల తర్వాత ఆ నగరాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అందుకు చక్కని ఉదాహరణే హైదరాబాద్ అని గద్దె అన్నారు. అమరావతిని ఛిన్నాభిన్నం చేసేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని యువత భవిష్యత్తుకు అవసరం అయినా రాజధానిపై కుయుక్తులు పన్నడం సరికాదన్నారు. జగన్ వాఖ్యలతో ఆ పార్టీ మరింత అధః పాతాళానికి వెళ్ళిందని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, కొక్కిర తిరుపతయ్య, దయాల శిరీషా, పీరుబాబు, రాయి రంగమ్మ, దాసరి గాబ్రియేలు, ముని పోలిపల్లి, భాగం సాయి, కర్ణా రమేష్, తాడి బాబురావు, సిద్ధం నాగేంద్ర రెడ్డి, ముని కృష్ణ, గోగుల ఏసు, గళ్లా శ్రీను, కోట శివలీల, గోగుల గోపి, పలు డివిజన్ల అధ్యక్షులు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం 17 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ పనులకు శ్రీకారం.

**500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ, జూలై 2(నేటి శుభోదయ):- 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేట వాటర్ ట్యాంక్ ఎదురు కొత్తగా 17 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ పనులకు ప్రభుత్వ విప్, సెంట్రల్ బొండా ఉమామహేశ్వరరావు గురువారం శంకుస్థాపన చేసారు.

ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రతి డివిజన్‌లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని,సెంట్రల్ నియోజకవర్గంలో ఇప్పటికే రూ.500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు ప్రారంభించి, అనేక పనులను పూర్తి చేసినట్లు, ఇటీవల 98.68 కోట్ల వ్యయంతో గుణదల ాజ-316 రైల్వే రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ద్వారా దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు.

అదేవిధంగా, సెంట్రల్ లోని 21 డివిజన్లకు శుద్ధమైన తాగునీటిని అందించేందుకు 82 కోట్లతో వాంబే కాలనీలో రా వాటర్ ఫిల్ట్రేషన్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి రా వాటర్‌ను తీసుకువచ్చి శుద్ధి చేసి అన్ని ఓవర్‌హెడ్ ట్యాంకులకు సరఫరా చేయడం ద్వారా భవిష్యత్తులో మంచినీటి కొరత లేకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కొద్ది రోజులలోనే సుమారు 180 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ఉమా పేర్కొన్నారు.

రోడ్లు, డ్రింకింగ్ వాటర్ పైప్‌లైన్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల భవనాలు, కమ్యూనిటీ హాళ్లు వంటి ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.57వ డివిజన్‌లో రూ.17 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసినట్లు పేర్కొంటూ, ఈ పనులను 7 నుంచి 10 రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

సెంట్రల్ లోని ప్రతి డివిజన్ సమస్యపై పూర్తి అవగాహన ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా దశలవారీగా అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ సెంట్రల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని ఉమా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో నాగవంస కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు, డివిజన్ అధ్యక్షులు ాని కబీర్, ాని నాగూర్ మీరా, సొంటి ఈశ్వరి, వేణు, ఎరుబోతు కనకరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయుల మధ్య అట్టహాసంగా టి ఎన్ టి యు సి రాష్ట్ర డైరెక్టర్, టిడిపి సీనియర్ నాయకుడు 'తెలగం శెట్టి శ్రీను' జన్మ దినోత్సవం వేడుకలు..!




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, టిఎన్టియుసి రాష్ట్ర డైరెక్టర్, కాపవరం మాజీ సర్పంచ్ తెలగంశెట్టి శ్రీను జన్మదినోత్సవ వేడుకలు బుధవారం రాత్రి కాపవరం గ్రామంలో అట్టహాసంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించినటువంటి తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో తెలగంశెట్టి శ్రీను జన్మదినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కాపవరం గ్రామం తో పాటు వివిధ గ్రామాలకు చెందినటువంటి శ్రీను సన్నిహితులు, అభిమానులు, స్నేహితులు, పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేయించారు. శాలువలు, పూలమాలలు, పుష్ప గుచ్చాలతో అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మిత్రులు, శ్రేయోభిలాషులకు శ్రీను పెద్ద ఎత్తున ఆత్మీయ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీను అనుచరులు గ్రామంలో భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. పార్టీలకు అతీతంగా అధిక సంఖ్యలో మిత్రులు, అభిమానులు, నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు కటకం చలం, రొంగల శ్రీనివాస్, వల్లేపల్లి దుర్గారావు, కాలచర్ల శివాజీ, ఆకుల ఆదిత్య, కామిశెట్టి దొరబాబు, కొండేటి ధర్మరాజు, పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం నాణ్యత పెంపకానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం




( నేటి శుభోదయ జులై : 03 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) రేషన్ బియ్యం నాణ్యతను పెంచుతూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. సాధారణ బియ్యంలో నూకల శాతాన్ని 25% నుండి 10 శాతానికి, ఉప్పుడు బియ్యంలో 16% నుండి 5 శాతానికి తగ్గిస్తున్నట్లు కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటించారు. ఆహార భద్రత వ్యవస్థను బలోపేతం చేసే ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా 80 కోట్లకు పైగా లబ్ధిదారులకు మరింత నాణ్యమైన బియ్యం అందనున్నాయి.

## "పార్టీ వేరు.. ప్రభుత్వం వేరు... బోత్ ర్ నాట్ సేమ్"..!!

**– ఆత్మగౌరవం కోసం కదిలిన 'డేరింగ్ అండ్ డాషింగ్' రామ్..**



( నేటి శుభోదయ జులై : 03 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖపట్నం రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగుతోంది. తెలుగుదేశం పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా నిస్వార్థంగా, ప్రాణాలకు తెగించి పనిచేసిన తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఇప్పుడు సొంత పార్టీలోనే తన ఉనికి కోసం, ఆత్మగౌరవం కోసం ఒక నైతిక పోరాటానికి శంఖారావం పూరించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును అన్యాయంగా జైల్లో పెట్టినప్పుడు, ఆయన విడుదల కోసం ప్రతి రోజూ అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర రామ్‌ది. అంతేకాదు, ఏకంగా ఆరు సార్లు వైఎస్సార్సీపీకి గట్టి పట్టున్న పులివెందుల గడ్డపైకే వెళ్లి, ఆ పార్టీకి వ్యతిరేకంగా ధైర్యంగా కార్యక్రమాలు నిర్వహించి వచ్చిన డేరింగ్ అండ్ డాషింగ్ లీడర్‌గా ఆయనకు పేరుంది.అలాంటి నిఖార్సయిన నాయకుడిపై ఈరోజు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మరియు అతని బృందం, అనుచరులు దాడికి తెగబడటం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇంత జరుగుతున్నా చంద్రబాబు నాయుడు చూస్తూ ఊరుకోవడాన్ని రామ్ అస్సలు తట్టుకోలేకపోతున్నారు. పార్టీ కోసం సర్వస్వం ధారపోసిన తనకు జరిగిన, ఈ అన్యాయంపై, తన ఆత్మభిమానాన్ని కాపాడుకోవడానికి ఆయన ఆత్మగౌరవ పోరాటాన్ని మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే రామ్ ఇటీవల టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పార్టీ రాజకీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ అయిన టి.డి. జనార్ధన్‌ను ఒక ప్రైవేట్ హోటల్‌లో కలిసి తనకు జరిగిన నష్టంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ విషయాన్ని తక్షణమే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, తనకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విజయం సాధించే వరకు తన ఆత్మగౌరవం కోసం పోరాడుతానని స్పష్టం చేశారు. పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయమైన "తెలుగు ప్రజల ఆత్మగౌరవం" అనేదే టీడీపీ ప్రధాన నినాదమని, ఎన్టీఆర్ ఆశయాలను తాను ప్రజల్లోకి తీసుకెళ్తానని రామ్ పేర్కొన్నారు."పార్టీ వేరు.. ప్రభుత్వం వేరు... బోత్ ర్ నాట్ సేమ్" అనేది రామ్ ప్రధాన వాదన. ఒక సిద్ధాంతాన్ని నమ్మి, పార్టీ జెండాను మోస్తూ, నిస్వార్థంగా పని చేసే కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ ప్రాణసమానమే. కానీ, పార్టీ అధికారంలోకి రాగానే తమ స్వార్థ ప్రయోజనాల కోసం, అహకారంతో అక్రమాలకు పాల్పడే కొందరు తాత్కాలిక నాయకులు ఎప్పటికీ పార్టీ కాజాలరని ఆయన కుండబద్దలు కొట్టారు. నాయకత్వంలో ఉన్న వ్యక్తులు తప్పులు చేయవచ్చు, అన్యాయంగా ప్రవర్తించవచ్చు... కానీ ఆ వ్యక్తుల ప్రవర్తన వల్ల పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలు మారిపోవు. అందుకే పార్టీలో ఉంటూనే, జరుగుతున్న తప్పులను ఆయన అంత గట్టిగా నిలదీస్తున్నారు.అయితే, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ అసలు తప్పులను, వాస్తవాలను అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి వెళ్లకుండా కింది స్థాయి సెకండరీ గ్రేడ్ నాయకులు తీవ్రంగా అడ్డుకుంటున్నారు. తమ అక్రమాలు ఎక్కడ బయటపడతాయోననే భయంతో, చంద్రబాబు నాయుడిని కలవకుండా చుట్టూ ఒక కోటలా ఏర్పడి ఆయన్ను తప్పుదోవ పట్టిస్తున్నారు.విశాఖపట్నం లాంటి కీలక ప్రాంతంలో పార్టీ కోసం కష్టకాలంలో జైలు గేట్ల ముందు పోరాడిన వారిని, పులివెందుల లాంటి ప్రత్యర్థి గడ్డపైకి వెళ్లి పార్టీ జెండా ఎగరేసిన ధైర్యశాలురను ఈరోజు కింది స్థాయి నేతల స్వార్థం వల్ల నిర్లక్ష్యం చేస్తే, అది క్షేత్రస్థాయి కార్యకర్తల్లో తీవ్ర నిరాశను నింపుతుంది. ఇప్పటికే జరిగిన నష్టాన్ని పార్టీ అధిష్టానం తక్షణమే గుర్తించి, నష్ట నివారణ చర్యలు చేపట్టాలి. లేదంటే భవిష్యత్తులో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలబడే నిజమైన, నిఖార్సయిన నాయకులు కరువవుతారు.గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ అనుచరులు చేసిన దాడిపై పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నేరుగా జోక్యం చేసుకుని, స్పందించి, తనకు న్యాయం చేసేంత వరకు రామ్ ఆత్మగౌరవ పోరాటం ఆగే ప్రసక్తే లేదని స్పష్టమవుతోంది. న్యాయం జరిగి, తన ఆత్మగౌరవం నిలబడే వరకు, ఈ పోరాటాన్ని మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్లనున్నారు.

## రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యునిగా కాండ్రేగుల వెంకటరమణ

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం..!!**



( నేటి శుభోదయ : జులై : 03 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాలు శాఖ రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యునిగా వినియోగదారుల హక్కుల రక్షణ, సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టాల ఇన్ఫ్లుయన్సర్, ఉద్యమకర్త, రాష్ట్ర అవార్డు గ్రహీత కాండ్రేగుల వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు (ఎం.ఎస్.నెం. 8 తేది : 30-6-2026) జారీ చేసింది. రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాలు శాఖ మంత్రి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు ఉంటారు. కమిటీ పదవీ కాలం మూడేళ్లు. గడచిన 36 ఏళ్లుగా వినియోగదారుల రక్షణ చట్టం, 21 ఏళ్లుగా సమాచార హక్కు చట్టం అమలు, చట్టాలను ఎక్కువ సంఖ్యలో ప్రజలు వినియోగించుకునేందుకు వీలుగా అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం, ఉచితంగా దరఖాస్తులు పంపిణీ, పుస్తకాలు ప్రచురణల ద్వారా ఉద్యమ వ్యాప్తికి ఆయన తెలుగు రాష్ట్రాల్లో విశేషంగా కృషి చేస్తున్నారు. ప్రస్తుతం వెంకటరమణ కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా, అనకాపల్లి మండల కన్స్యూమర్స్ కౌన్సిల్ కార్యదర్శిగా, పబ్లిక్ ఫోరం రాష్ట్ర సమన్వయకర్తగా, వినియోగదారుల రక్షణ, ఆర్టీఐ చట్టాల రిసోర్స్‌పర్సన్‌గా, ఇన్ఫ్లుయన్సర్, కన్సల్టెంట్, విశ్లేషకునిగా సేవలందిస్తున్నారు. అదే విధంగా 36 ఏళ్లుగా జర్నలిస్ట్‌గా వివిధ పత్రికల్లో విధులు నిర్వహించిన కాండ్రేగుల వెంకటరమణ ప్రస్తుతం వినియోగదారుల రక్షణ, ఆర్టీఐ, మానవహక్కులు, జాతీయ ఆహార భద్రత చట్టాలు, వినియోగదారులు, ఆర్టీఐ కమిషన్ల తీర్పులు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, సిటిజన్ ఛార్టర్లు, ప్రభుత్వ సేవలు, సామాజిక అంశాలు ఇతివృత్తాలుగా 2006 నుంచి వెలువడుతూ భారత ప్రభుత్వం గుర్తింపు పొందిన 'జనం' జన చైతన్య మాస పత్రికకు అసోసియేట్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇంతవరకు వినియోగదారుల హక్కుల రక్షణ చట్టంపై 29, ఆర్టీఐ చట్టంపై 12, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్‌పై 11, తూనికలు, కొలతల శాఖ సేవలపై రెండు ప్రత్యేక పుస్తకాలను రూపొందించారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల నుంచి ఇంత వరకు 39 పర్యాయాలు అవార్డులు, ప్రశంసాపత్రాలు ఆయన పొందారు. గతంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వెలువడిన 'వినియోగదీపిక' పత్రికకు ఎడిటర్‌గా, కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (ఎన్‌వైకెఎస్) రాష్ట్ర సలహా కమిటీ సభ్యునిగా, ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ రైల్ యజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డీఆర్‌యుసీసీ) సభ్యునిగా కూడా సేవలందించారు. కాగా కాండ్రేగుల వెంకటరమణ నియామకం పట్ల ఆర్టీఐ, వినియోగదారుల సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షం ప్రకటించారు. ఆహార భద్రత చట్టం అమలుకు కృషి ఈ సందర్భంగా కాండ్రేగుల వెంకటరమణ మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు ఆహార భద్రత మెరుగ్గా కల్పించడం ధ్యేయంగా జాతీయ ఆహార భద్రత చట్టం-2013 సంక్షేమ పథకాలు రేషన్ సరుకులు పంపిణీ, ఐసీడీఎస్, మధ్యాహ్న భోజనపథకం, సంక్షేమ వసతి గృహాలు, గురుకులంలో ఇచ్చే పౌష్టికాహారం, ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం (పీఎంఎంవివై మహిళల మొదటి కాన్పుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చు రూ. 5 వేలు), ఏపీ లక్షిత ప్రజా పంపిణీ వ్యవస్థ (నియంత్రణ) ఉత్తర్వు-2018. విజిలెన్స్ కమిటీ లక్ష్యాలు అమలుకు కృషి చేస్తానని తెలిపారు.

# 'ప్రజల సేవకా లేక ప్రజలను వేధించే యంత్రాంగమా

**పెందుర్తి జోనల్ కార్యాలయం పరిధిలో సచివాలయం 502 వద్ద సిబ్బంది తీరుపై విమర్శల జడి!"**







( నేటి శుభోదయ జులై :03 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) "ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సామాన్యులకు, నిత్యం ప్రశ్నించే పాత్రికేయులకు సచివాలయాల్లో ఎదురవుతున్న అవమానాలు, వేధింపులు ఏ స్థాయిలో ఉన్నాయో చెప్పడానికి ఈ ఘటన ఒక నిదర్శనం. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ.. ఇప్పుడు ఒక వ్యక్తిగత కోటలా మారుతోందా విలేకరులను బెదిరించే స్థాయికి అధికారులు ఎలా వెళ్లారు? రికార్డ్ అయిన ఈ వాయిస్ ఇప్పుడు సంచలనంగా మారింది!"

### నిలదీస్తే వేధింపులా

సమాచార హక్కు చట్టం (ఆర్ టీ ఐ ) ద్వారా సమాచారం కోరిన వారిని, వాస్తవాలను వెలికితీసే పాత్రికేయులను సచివాలయ సిబ్బంది బెదిరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్ల్యూ.పి.ఆర్.ఎస్ శుభలక్ష్మికి సంబంధించిన ఆడియో, సచివాలయ అధికారుల అసహనానికి అద్దం పడుతోంది.

### బాధ్యత మరిచిన అధికార గర్వం

"మేము ఖాళీగా లేము, మీరు ఎందుకు ఫోన్ చేస్తున్నారు?" అని సమాధానం ఇవ్వడం ద్వారా, తాము ప్రజలకు సేవకులు అనే విషయాన్ని సదరు సిబ్బంది మర్చిపోయారని స్పష్టమవుతోంది. ఫోన్లను ఎత్తకుండా లేదా పక్కన పెట్టేసి, ప్రశ్నించే వారిని అనాలోచితంగా బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించడం వారి దురుసు ప్రవర్తనకు పరాకాష్ట.

### వ్యక్తిగత కక్షల వేదికగా సచివాలయం

సచివాలయం వంటి కీలకమైన ప్రభుత్వ కార్యాలయాలను వ్యక్తిగత కక్షలకు వేదికగా మార్చుకోవడం దారుణం. ఒక వ్యక్తిని ఉద్దేశించి, "మీ మీద నాకు గౌరవం లేదు" అని బహిరంగంగా అనడం, తమకు నచ్చని వారిని విధుల్లో వేధించడం వంటి చర్యలు అధికారుల నైతికతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

### అధికారుల మౌనం.. ప్రజా వ్యతిరేకత

ఈ వ్యవహారంపై సంబంధిత ఉన్నతాధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారువిలేకరులను, ఆర్.టి.ఐ యాక్టివిస్టులను బెదిరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోకపోతే, ప్రజాస్వామ్యానికి అర్థం ఏమిటి? "మేము వేరే ఫోన్ లో బిజీగా ఉన్నాము" అని సాకులు చెప్పడం కాకుండా, బాధ్యతగా సమాధానం చెప్పాల్సిన సిబ్బంది, ఇలా ప్రవర్తించడం వ్యవస్థకే సిగ్గుచేటు.ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటున్న సిబ్బంది, అదే ప్రజలను భయపెట్టడం సరికాదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి అధికారుల తీరును మార్చాలి, లేదా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు

# విశాఖను మింగేస్తున్న కార్పొరేట్ తిమింగలాలు..

**– పాలకులారా, మీ దోపిడీపై శ్వేతపత్రం ఇచ్చే దమ్ముందా– భోగాపురం భ్రమలు వద్దు.. వసతులు లేని ఎయిర్పోర్ట్‌ను ఓపెన్ చేయొద్దు గూగుల్ డేటా సెంటర్ పేరిట వనరుల దోపిడీ -- లోకేష్‌కు బహిరంగ సవాల్– సింహాద్రి అప్పన్న కొండలను పిండి చేస్తారా?.. దేవుని ఆగ్రహం తప్పదు – పేదలకు 22ఏ ఉచ్చు.. వరుణ్ గ్రూప్‌నకు జీవోల హెచ్చు!**



( నేటి శుభోదయ జులై : 03 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖపట్నం వేదికగా సాగుతున్న భూముల అక్రమ కేటాయింపులు, పర్యావరణ విధ్వంసంపై తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. ఇందులో భాగంగా ప్రతిపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణతో రామ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గూగుల్ డేటా సెంటర్ పేరిట సింహాచలం కొండలను పిండి చేస్తున్న తీరును, మహారాణిపేట ఊటగడ్డ భూములను నిబంధనలకు విరుద్ధంగా వరుణ్ గ్రూప్‌నకు కట్టబెడుతున్న ఉదంతాలను ఆయనకు కూలంకషంగా వివరించి, ఒక సమగ్ర వినతి పత్రాన్ని సమర్పించారు.అనంతరం రామ్ మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర గుండెకాయ లాంటి విశాఖపట్నం ఇప్పుడు పాలకుల నిర్వాకంతో కార్పొరేట్ సంస్థల దోపిడీకి అడ్డాగా మారిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల కనీస అవసరాలను, పర్యావరణ సమతుల్యతను గాల్లోకి దీపాల్లా వదిలేసి, బడా బాబుల గల్లా పెట్టెలు నింపడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సాగుతోందని మండిపడ్డారు. ఎయిర్పోర్ట్ తరలింపు ప్రక్రియలో ప్రయాణికుల ఇబ్బందులు, గూగుల్ డేటా సెంటర్ వెనుక దాగున్న వనరుల మాయాజాలం, మహారాణిపేట ఊటగడ్డ భూముల అక్రమ కేటాయింపులపై ఆయన నిప్పులు చెరిగారు. చట్టాలు పేదలకు ఒకలా, అపర కుబేరులకు మరోలా మారుస్తున్న పాలకుల ద్వంద్వ నీతిని సమాధి చేసే వరకు తన పోరాటం ఆగదని హెచ్చరించారు.విశాఖపట్నంలో అన్ని హంగులు, రవాణా సౌకర్యాలు, వసతులు ఉన్న విమానాశ్రయం నుండి ప్రతి ఏటా దాదాపు 30 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇంతటి భారీ రద్దీని తట్టుకునే కనీస సామర్థ్యం లేని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని హలావుడిగా ప్రారంభించవద్దని రామ్ డిమాండ్ చేశారు. అక్కడ ప్రయాణికులకు అవసరమైన హోటల్ వసతి గానీ, ఇతర మౌలిక వసతులు గానీ ఇంకా పూర్తి కాలేదు. ఈ ఏడాది డిసెంబర్ వరకు సమయం ఉంది కాబట్టి, ఆలోగా అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు అన్నీ కల్పించిన తర్వాతే భోగాపురం ఎయిర్పోర్ట్‌ను తెరవాలని, అప్పటివరకు ప్రస్తుతమున్న విశాఖ ఎయిర్పోర్ట్‌ను ఇక్కడే యథావిధిగా కొనసాగించాలని స్పష్టం చేశారు. కళ్లు మూసుకుని ప్రారంభోత్సవాల రిబ్బన్లు కట్ చేస్తే ప్రయాణికులకు నరకం చూపించినట్టే అవుతుందని హెచ్చరించారు.గూగుల్ డేటా సెంటర్ వస్తోంది.. ఉద్యోగాల వరద పారుతుందంటూ ప్రచారం చేసుకుంటున్న ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు బి.వి.రామ్ పవర్ ఫుల్ సవాల్ విసిరారు. ఒక డేటా సెంటర్ నడవాలంటే అపారమైన విద్యుత్, నీరు కావాలి. ఈ ప్రాజెక్టుకు ప్రతిరోజూ ఎన్ని లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతుంది ఎంత మెగావాట్ల కరెంటు ఇస్తున్నారు? ఈ లెక్కలను బయటపెట్టి వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని నిలదీశారు. విశాఖ ప్రజల తాగునీటిని, కరెంటును లాక్కుని గూగుల్‌కు కట్టబెడితే ఇక్కడి స్థానిక యువతకు వచ్చే ఉద్యోగాలెన్ని? ఈ భూ కేటాయింపులు, వనరుల వినియోగం, ఉపాధి అవకాశాలపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని మంత్రి లోకేష్‌కు సవాల్ చేశారు. కారుచౌకగా భూములు ధారాదత్తం చేయడం వెనుక ఉన్న రహస్యమేంటో తేలాలన్నారు.గూగుల్ డేటా సెంటర్ పేరుతో విశాఖపట్నానికి రక్షణ నిలయంగా ఉన్న పవిత్ర సింహాచలం కొండలను పిండి పిండి చేస్తున్నారని రామ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని, పర్యావరణాన్ని, దేవుని భూములను ధ్వంసం చేస్తూ సాగుతున్న ఈ రాక్షస పాలనపై సింహాద్రి అప్పన్న ఆగ్రహం ఖచ్చితంగా ఉంటుందని హెచ్చరించారు. దేవుడిని గుళ్లల్లో పూజిస్తూ, బయట ఆయన కొండలను తవ్వేస్తున్న ఈ కూటమి ప్రభుత్వానికి కాలం సమీపించిందని, పర్యావరణ విధ్వంసానికి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని పదునైన వ్యాఖ్యలు చేశారు.మహారాణిపేట ఊటగడ్డ ప్రాంతంలో విలువైన భూములను నిబంధనలకు విరుద్ధంగా వరుణ్ గ్రూప్‌నకు ఎలా కట్టబెడతారని రామ్ నిలదీశారు. ప్రభుత్వ రెవెన్యూ రికార్డులలోనే క్లియర్‌గా అది 'ఊటగడ్డ' అని రాసి ఉంది. అలాంటప్పుడు ఆ భూమి చట్టప్రకారం 22ఏ (నిషేధిత భూముల జాబితా) లో ఉండాలి. సామాన్య, పేద ప్రజల భూములు చిన్న సాంకేతిక కారణాలు వల్ల 22ఏ లో పడితే, వాటిని తొలగించకుండా అధికారులు ముప్పుతిప్పలు పెడుతూ, సంవత్సరాల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారు. అదే కార్పొరేట్ శక్తులకు భూములు కావాల్సి వస్తే, రికార్డులను పక్కనబెట్టి రాత్రికి రాత్రే అనుకూలమైన జీవోలు ఎలా ఇస్తారని పాలకుల ద్వంద్వ నీతిని బట్టబయలు చేశారు. చట్టాలు పేదలకు చుట్టాలుగా, కార్పొరేట్లకు దాసోహమనేలా మారడం దుర్మార్గమన్నారు.ప్రభుత్వాలు మారినా పాలకుల బుద్ధులు మారడం లేదని, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే ఈ వ్యవస్థ మారాలని బి.వి. రామ్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో చట్టం ముందు పేదవాడైనా, కార్పొరేట్ సంస్థ అయినా ఒక్కటే కావాలి. ప్రభుత్వం అందరినీ ఒకే కంటితో చూసే రోజు వచ్చేంతవరకు, పాలకుల తప్పులను ఎండగడుతూ తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని, ఈ దోపిడీపై తాడోపేడో తేల్చుకుంటామని రామ్ అత్యంత శక్తివంతంగా ప్రకటించారు.తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ లేవనెత్తిన అంశాలపై సానుకూలంగా స్పందించిన బొత్స సత్యనారాయణ, ఈ దారుణాలపై తాము ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, అలాగే గవర్నర్‌కు కూడా లేఖ రాస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.ప్రతిపక్ష నేతను కలిసిన వారిలో డాక్టర్ పప్పూర్ నికుంజ, బొల్లినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు .

## శ్రీ శ్రీ శ్రీ వారాహి అమ్మ వారి వారోత్సవాలు సందర్భంగా భూపూజ కార్యక్రమం

**– ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాధం (జగన్)**



( నేటి శుభోదయ జులై : 03 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధి మీ సేవ గ్రౌండ్ లో శ్రీ శ్రీ శ్రీ వారిహి అమ్మవారి నవరాత్రుల మరియు అంబికా పంచాయతన యాగ మహోత్సవం లో భాగంగా గురువారం భపూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు మరియు మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాధం (జగన్) పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ముఖ్య అతిధులు మాట్లాడుతూ ఈనెల 15వ తారీకు నుండి జరగబోయే నవరాత్రులలో ప్రతి ఒక్కరు పాలుపంచుకొని అమ్మవారి అనుగ్రహం పొందుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు విజయరామరాజు, బిజెపి జిల్లా కార్యదర్శి లక్కరాజు సోమరాజు, బోండా ఎల్లాజీ రావు. సెక్రటరీ బొట్టా ప్రకాష్, బిజెపి అధ్యక్షులు అగ్గాల సురేష్, ద్రోణాద్రి అప్పలనాయుడు, ఆనందకుమార్,చొప్పా నూకరాజు, కళ్యాణ్ చక్రవర్తి, ఆదినారాయణ. గణేష్. జనసేన నాయకులు జ్యోతి రెడ్డి. ఇందిరా ప్రియదర్శిని. బి సరస్వతి. కే లక్ష్మి.మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కూలీల వలసల నివారణకు గొప్ప పథకం ప్రభుత్వ ఉపాధి హామీ పథకం



అనంత పురం జూలై 02 నేటి శు భోదయ :గ్రామీణ పేదల జీవనోపాధికి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ఎంతో గొప్ప వరమని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. కూలీల వలసలను నివారించి, గ్రామీణ కుటుంబాలకు స్థానికంగానే ఉపాధి కల్పించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసలను నివారించి, పేద కుటుంబాలకు స్థానికంగానే ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం దేశానికే ఆదర్శమని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. ఈ పథకం ద్వారా గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని, పేదల ఆర్థికాభివృద్ధికి ఇది బలమైన సోపానమని పేర్కొన్నారు.పుట్టపర్తి మండలం బత్తలపల్లి గ్రామంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ఇరవై ఏళ్లు పూర్తిచేసుకొని వీటికి వీడ్కోలు పలుకుతూ నేటి నుంచి నూతనంగా వీబీజీ రామ్‌జీ పనులను గురువారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అంతకు ముందు సచివాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు వేలాది మంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్న ఈ పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.పుట్టపర్తి నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.120 కోట్లకు పైగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. చెరువుల అభివృద్ధి, కాలువల నిర్మాణం, మట్టి రోడ్లు, మొక్కల పెంపకం, నీటి సంరక్షణ వంటి అనేక పనులు గ్రామాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని చెప్పారు.అనంతరం గ్రామ సచివాలయం వద్ద మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కూటమి పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.అలాగే గ్రామంలోని హెల్త్ సెంటర్‌ను సందర్శించి అక్కడి వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపిడి రమేష్ బాబు ఎంపీడీవో నాగేశ్వర్రెడ్డి ,పెదబల్లి సహకార సొసైటీ అధ్యక్షులు విజయకుమార్ మాజీ జెడ్పిటిసి శ్రీ రామ్ నాయక్ మాజీ వైస్ ఎంపీపీ బొమ్మయ్య నాగరాజు మహేష్ శ్రీనివాసులు కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు, మహిళలు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 6 కి.మీ భుజాలపై మోసిన వార్డెన్!

**– విద్యార్థిని కోసం మానవత్వం చాటిన టీచర్!!**



( నేటి శుభోదయ జులై : 03 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) మన్యం జిల్లాలో ఓ వార్డెన్ మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. గుమ్మలక్ష్మీపురం గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థిని వాటాక భువనేశ్వరి తీవ్ర జ్వరంతో పాఠశాలకు రాకపోవడంతో వార్డెన్ హేమ స్వయంగా గ్రామానికి వెళ్లారు. అక్కడ రవాణా సౌకర్యం లేకపోవడంతో విద్యార్థినిని భుజాలపై మోసుకుంటూ సుమారు 6 కిలోమీటర్ల పాటు రాళ్ల దారిలో నడిచి ఆసుపత్రికి చేర్చారు. వార్డెన్ హేమ చూపిన సేవాభావం, బాధ్యతపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## ఉపాధి హామీ పథకం కార్యక్రమాన్ని పరిశీలించిన కూటమి నాయకులు

**'గ్రామీణ ఉపాధికి వికసిత్ భారత్ మంచి హామీ..!'**

**– బీజేపీ కిసాన్ మోర్చా నియోజకవర్గ నాయకులు పెనకటి రాంబాబు..**




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); ఉపాధి హామీ పథకం కార్యక్రమ పనులను గురువారం కూటమి నాయకులు పరిశీలించారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలోని ఉపాధి హామీ పనుల పర్యవేక్షించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ పేదల కోసం ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. దీనిని రైతులు, వ్యవసాయ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధాని మోడీ సారధ్యంలో భారత్ దేశం వికశిత భారత్ గా అభివృద్ధి చెందుతుందని బిజెపి నాయకుడు పెనకటి రాంబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు తనకాల నాగేశ్వరరావు, మద్దాల రమణ, పెనకటి రాంబాబు, సూరిశెట్టి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## మల్కాపురం లాండ్ ఆర్డర్ సిఐగా నరసింహారావు బాధ్యతలు స్వీకరణ..!!



( నేటి శుభోదయ జులై : 03 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) మల్కాపురం పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ సీఐగా ఈ. నరసింహారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. 1998 బ్యాచ్ సంబంధించిన ఈయన విశాఖ సిటీలో ఎస్సైగా స్టీల్ ప్లాంట్, పనిచేసి మంచి పేరును తెచ్చుకున్నారు. అదేవిధంగా గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సిఐగా హార్బర్ లా అండ్ ఆర్డర్ సిఐగా విధులు నిర్వర్తించి సి టి ఆర్ బి ఆయా విభాగాల్లో మంచి గుర్తింపు పొంది ప్రస్తుతం మల్కాపురం సిఐ గా బాధ్యతలు స్వీకరించడంతో ఆయనకు మల్కాపురం పోలీస్ స్టేషన్లో సిబ్బంది సాదర స్వాగతం పలికారు.

## కంప్యూటర్లపై టాస్క్ లు తేలిగ్గా పరిష్కారం..

### ఏఐ చాట్ బోట్ స్థానే ఏఐ ఏజెంట్స్..

### త్వరలో ఆవిష్కరించనున్న ఓపెన్ ఏఐ



టెక్నాలజీ రంగంలో పలు మార్పులు తెచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) క్షణాల్లో జవాబులిస్తూ యూజర్లను ఆశ్చర్య చకితుల్ని చేస్తున్నది. ఓపెన్ ఏఐ అనే స్టార్టప్ సంస్థతోపాటు పలు సంస్థలు తెచ్చిన చాట్‌బోట్‌లు సంచలనం సృష్టించాయి. మరింత మెరుగ్గా ఈ సేవలు అందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లు అందుబాటులోకి వస్తున్నాయి. చాట్‌జీపీటీ సృష్టికర్త ఓపెన్ ఏఐ ఈ 'ఏఐ ఏజెంట్ల'ను పరిచయం చేసేందుకు రెడీ అవుతున్నదని వార్తలొస్తున్నాయి. ఈ 'ఏఐ ఏజెంట్ల' రాకతో మన పనులు మరింత



సులభమయ్యే అవకాశాలు ఉన్నాయి. కంప్యూటర్ సిస్టమ్ లోని టాస్క్‌లు వేగంగా పూర్తి చేయడానికి త్వరితగతిన ఏఐ ఏజెంట్లు అందుబాటులోకి తేవడానికి ఓపెన్ ఏఐ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం పలు రీసెర్చ్ ప్రాజెక్టులపై పని చేస్తున్నట్లు సమాచారం. డెవలపర్లకు రీసెర్చ్ ప్రీవ్యూగా ఏఐ ఏజెంట్లను ఓపెన్ ఏఐ వచ్చే జనవరికల్లా అందుబాటులోకి తేనున్నది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తర్వాత ఎక్కువగా ఏఐ ఏజెంట్స్ పేరు వినిపిస్తోంది. ఏఐ చాట్ బోట్ వంటివే ఏఐ ఏజెంట్స్ అనే భావన చాలా మందిలో ఉంది కానీ.. ఏఐ చాట్ బోట్స్.. ఏఐ ఏజెంట్స్ విభిన్నం. ఏఐ చాట్ బోట్ కేవలం యూజర్ల ప్రశ్నలకే స్పందిస్తుంది తప్ప.. తన పరిధి దాటి ముందుకెళ్లలేదు. కానీ ఏఐ ఏజెంట్ ప్రశ్నల ఉద్దేశం.. సందర్భాన్ని అర్థం చేసుకుని స్వేచ్ఛగా ఆలోచించి, నిర్ణయాలు తీసుకునే యంత్రాంగం సాయంతో మెరుగ్గా ప్రతిస్పందిస్తుంది. కంప్యూటర్లలో పనులు పూర్తి చేయగల ఏఐ ఏజెంట్లను ఓపెన్ ఏఐ అభివృద్ధి చేసిందని సమాచారం. ఏఐ ఏజెంట్లు కోట్ రాసి, టికెట్ బుకింగ్ వంటి క్లిష్టమైన పనులు తేలిగ్గా పూర్తి చేస్తాయని చెబుతున్నారు. వచ్చే ఏడాది ఏఐ ఏజెంట్లను అందుబాటులోకి తెస్తామని ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ ఇటీవల చెప్పారు.

## మరోసారి చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైన ఇస్రో..

### 4న ప్రోబా-3 మిషన్ ప్రయోగం..!




భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ మరోసారి చరిత్ర సృష్టించేందుకు రెడీ అయ్యింది. భానుడి రహస్యాలను ఛేదించేందుకు సిద్ధమైంది. గతంలో ఆదిత్య ఎల్-1 మిషన్‌ను చేపట్టిన ఇస్రో తాజాగా.. ప్రోబా-3 మిషన్ ప్రయోగించబోతున్నది. వివిధ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో భాగస్వాములయ్యారు. మిషన్ ప్రయోగం బాధ్యతలను ఇస్రో తీసుకుంటుండగా.. శాటిలైట్‌ను నింగిలోకి ఇస్రో విజయవంతమైన రాకెట్ పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ తీసుకెళ్లనున్నది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రోబా-3 మిషన్‌ను డిసెంబర్ 4న ఏపీలోని శ్రీహరికోట స్పేస్‌పోర్ట్ నుంచి ప్రయోగించనున్నట్లు ఇస్రో వెల్లడించింది. ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ సహకారంతో ప్రోబా-3ని ప్రయోగించబోతున్నారు. బుధవారం సాయంత్రం 4:08 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనున్నది. మిషన్‌లో భాగంగా 550 కిలోల బరువున్న ఉపగ్రహాలను ప్రత్యేకమైన దీర్ఘవృత్తాకార కక్ష్యలో ఉంచనున్నట్లు ఇస్రో పేర్కొంది. ఇది సంక్లిష్ట కక్ష్యలోకి ఖచ్చితత్వంతో ప్రయోగం నిర్వహించేందుకు విశ్వసనీయతను పీఎస్ఎల్‌వీ బలోపేతం చేస్తుందని పేర్కొంది. మిషన్‌లో భాగంగా యూరోపియన్ ఏజెన్సీ సూర్యుడి వాతావరణంలోని బయటి, అత్యంత వేడిపొర అయిన సోలార్ కరోనాను అధ్యయనం చేయనున్నది. ప్రోబా-3 మిషన్‌లో ప్రయోగించిన ఉపగ్రహాలు కృత్రిమ సూర్యగ్రహణ పరిస్థితులను సృష్టిస్తాయి. తద్వారా సూర్యుడి బయటి పొర అంటే.. కరోనాను అధ్యయనం చేస్తాయి. ఈ జంట ఉపగ్రహాల్లో ఒక దాంట్లో కరోనాగ్రాఫ్ ఉంటుంది. మరొకటి ఆల్టరర్ కలిగి ఉంటుంది. ఈ ఉపగ్రహాలలో ఒకటి సూర్యుడిని కనిపించకుండా కృత్రిమ గ్రహణం పరిస్థితి సృష్టిస్తే.. మరొకటి కరోనాను నిశితంగా గమనిస్తూ వస్తుంది. ప్రోబా-3 మిషన్ స్పెయిన్, పోలాండ్, బెల్జియం, ఇటలీ, స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తల కృషి ఫలితం. మిషన్‌లో రెండు ఉపగ్రహాలను ఒకేసారి ప్రయోగించబోతున్నారు. ఈ రెండేళ్ల సుదీర్ఘ మిషన్ ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ ఉపగ్రహాలు నిర్ణీత కక్ష్యలోకి చేరుకోవడం కీలకం. ఎందుకంటే ఒకదానితో మరొకటి సమన్వయం చేసుకుంటూ కరోనాపై అధ్యయనం చేస్తాయి. ఇందులో ఏ ఒక్కటి పని చేయకపోయినా రెండో శాటిలైట్‌కు ఉపయోగం లేకుండాపోతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

## చావు ఏ రోజో చెప్పే ఏఐ!



టెక్నాలజీ దాదాపు అన్ని రంగాల్లో విస్తరిస్తోంది. కృత్రిమమేధ పరిధి పెరుగుతోంది. కిచెన్‌లో రిఫ్రిజిరేటర్, టీవీ, మొబైల్ ఫోన్, ఫ్యాన్.. వంటి అన్ని విభాగాల్లోకి ఏఐ ప్రవేశించింది. సమీప భవిష్యత్తులో మనిషిని ప్రత్యక్షంగా, పరోక్షంగా శాసించే స్థాయికి ఏఐ వెళ్లనుందనేది కఠోర సత్యం. దీని సాయంతో చాలా కంపెనీలు సమాచారాన్ని సేకరించి సులువుగా పని అయ్యేలా చూస్తున్నాయి. కొన్ని సంస్థలు మరింత విభిన్నంగా ఆలోచించి మనిషి మరణాన్ని అంచనా వేసేందుకు ఉపయోగిస్తున్నాయి. మనిషి జీవనశైలి, ఆహార అలవాట్లు, శారీరక శ్రమ, ఒత్తిడి.. వంటి వివరాలు అందించి మరణానికి మరెంత సమయం ఉందో తెలుసుకునేందుకు ఏఐ సాయం కోరుతున్నారు. ఈమేరకు మార్కెట్లో కొత్తగా యాప్‌లో వెలుస్తున్నాయి. వీటిపై వినియోగదారుల్లో ఆసక్తి నెలకొనడంతో వీటికి ఆదరణ పెరుగుతోంది.

మరణ తేదీ అంచనా..

'డెత్ క్లాక్' అనే కృత్రిమ మేధ ఆధారిత యాప్ వినియోగదారుల జీవనశైలి, అలవాట్ల ఆధారంగా వారి ఆయుష్షును అంచనా వేయగల సామర్థ్యం కలిగి ఉంది. దీన్ని జులైలో ప్రారంభించినప్పటి నుంచి చాలామంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. బ్రెంట్ ఫ్రాన్సన్ అభివృద్ధి చేసిన ఈ యాప్ దాదాపు 1,200 కంటే ఎక్కువ అధ్యయనాలను విశ్లేషిస్తుంది. 5.3 కోట్ల మంది నుంచి సేకరించిన వివరాలను అధ్యయనం చేస్తుంది. వినియోగదారు తీసుకునే ఆహారం, చేసే వ్యాయామం, ఒత్తిడి స్థాయిలు, నిద్రపోయే విధానాలు.. వంటి విభిన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని మరణించే అవకాశం ఉన్న తేదీని అంచనా వేస్తుంది.

సమయం వృథా చేయడం దేనికి..

మరణం ఎప్పుడైనా, ఎలాగైనా సంభవించవచ్చు. మన పరిధిలోలేని దాని గురించి ఆలోచించి సమయం వృథా చేయడం కంటే.. మరణం తథ్యం అనే వాస్తవాన్ని జీర్ణించుకుని జీవితంలో చేయాల్సిన కార్యాలు, మంచి పనులపై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆకస్మాత్తుగా ఏదైనా జరిగి మరణిస్తే కుటుంబానికి ఆర్థికంగా భరోసానిచ్చే టర్మ్ పాలసీను తప్పకుండా తీసుకోవాలని చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ఆసుపత్రిపాలైతే ఆరోగ్యబీమా ఆదుకుంటుందని సూచిస్తున్నారు.

# తీరికూర్చుని త్రిభాషా సూత్రం

దేశంలో హిందీ భాషకు ఆధిపత్య స్థానం కల్పించాలనుకుంటున్న ప్రతిసారీ దక్షిణాదిలో... ముఖ్యంగా తమిళనాడులో వివాదం తలెత్తుతుండగా కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ) కొత్త ఎత్తుగడతో ఆ భాషను ప్రతిష్ఠించదల్చుకున్నట్టు కనబడుతోంది. అందువల్లే శుక్రవారంనాటి ఆ సంస్థ మార్గదర్శకాలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. జాతీయ విద్యావిధానం--2020కి అనుగుణంగా జారీ చేసినట్టు చెబుతున్న ఈ మార్గదర్శకాల ప్రకారం ఇకపై విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవడం తప్పనిసరి. అందులో ఒకటి విదేశీ భాష. మిగిలిన రెండూ 'స్థానిక భాషలు'. త్రిభాషా సూత్రంగా పిలిచే ఈ విధానం వాస్తవానికి కొఠారీ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా రూపొందిన జాతీయ విద్యావిధానం--1968 నాటిదే. కేంద్రంలో ఏ పార్టీ లేదా కూటమి అధికారంలో ఉన్నా ఏదోవంకన హిందీని తీసుకొచ్చే ప్రయత్నం చేయటం రివాజైంది. ఉభయ తెలుగు రాష్ట్రాలతోసహా చాలా రాష్ట్రాలు త్రిభాషా సూత్రాన్ని అనుసరిస్తున్నా, తమిళనాడు మాత్రం తమిళంతోపాటు ఇంగ్లిష్ బోధన ఉండే ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంది. విద్యార్థి దశలో వివిధ భాషలపట్ల ఆసక్తి, అనురక్తి పెంచి ప్రోత్సహించటంలో తప్పేం లేదు. కానీ ఆ వంకన ఒక భాష ఆధిపత్యాన్ని నెలకొల్పుదామనుకోవటమే సమస్య. ఇప్పటికైతే తల్లిదండ్రులు విద్యాసంవత్సరం మొదలై రెండునెలలు గడిచాక హఠాత్తుగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. పునరాలోచన చేయకుంటే ఇది భాషా వివాదంగా మారినా మారొచ్చు. వచ్చే జూలైనుంచి అమల్లోకి రాబోతున్న ఈ విధానం సమస్యాత్మకమైనది. అన్నిటా ఇప్పటికే భాగంగా మారిన ఇంగ్లిష్‌ను ఇది 'విదేశీ భాష' గా గుర్తిస్తోంది. మన ప్రభుత్వాల ఉత్తరప్రత్యుత్తరాలు, జీవోలు, చట్టాలు... అన్నీ ఇంగ్లిష్‌లో ఉంటాయి. న్యాయస్థానాల్లో వాదప్రతివాదాలు మొదలుకొని తీర్పులవరకూ దాని వాడకం విస్తృతం. ఇక ఐఐటీ, ఐఐఎంలాంటి ఉన్నతశ్రేణి సంస్థల్లో చెప్పనవసరం లేదు. ఉన్నత చదువులకైనా, ఉద్యోగావకాశాలకైనా అదొక తప్పనిసరి అవసరం. ఈ దశలో ఇంగ్లిష్‌ను 'విదేశీభాష'గా గుర్తించటం వల్ల మన విద్యార్థులు జర్మన్, ఫ్రెంచ్, జాపనీస్, కొరియన్ వంటి భాషలు నేర్చు కొనే అవకాశాన్ని కోల్పోతారు.




ప్రపంచవ్యాప్తంగావున్న తీవ్ర పోటీ పర్యవసానంగా ఉద్యో గార్థులు వారి వారి రంగాల్లో నైపుణ్యం సాధిస్తే సరిపోదు. ఇంటర్వ్యూల్లో దాన్ని సమర్థ వంతంగా వ్యక్తం చేయగలగాలి. ఏ ఉత్పత్తికైనా ప్రపంచవ్యాప్త మార్కెట్ ఏర్పడిన వర్తమానంలో ఇంగ్లిష్‌తోపాటు మరో విదేశీ భాష వస్తేనే ప్రాముఖ్యత. కానీ సీబీఎస్ఈ తీరుతో ఇంగ్లిష్ విడనాడితేనే మరో విదేశీ భాష సాధ్యం. ఉత్తరాదిన త్రిభాషా సూత్రం ఎంచక్కా అమలవుతోంది. వారు హిందీతోపాటు సంస్కృతాన్ని 'స్థానిక భాష'గా నేర్చుకుంటారు. 'విదేశీ భాష'గా ఇంగ్లిష్ ఉండనే ఉంది! దక్షిణాదిన మాత్రం స్థానిక భాషతోపాటు ఎంచుకోవటానికి హిందీ లేదా సంస్కృతం ఉంటాయి. సినిమాల ప్రభావంవల్ల సహజంగా అత్యధికులు హిందీని ఎంచుకుంటారు. దక్షిణాది రాష్ట్రాలు హిందీకి దాదాపు అలవాటుపడినట్టే... అటువైపువారు సైతం తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం, ఒరియావంటి భాషల్లో ఏదో ఒకటి నేర్చుకోవటం తప్పనిసరి చేస్తే వివక్ష కనబడేది కాదు. పైగా ఇటువైపువారికి ఉత్తరాదిన ఉద్యోగావ కాశాలు లభించేవి. ఎ

కానీ ఆ పని చేయరు. తొమ్మిదో తరగతికి వర్తింపజేస్తూ తీసుకొచ్చిన ఈ నిర్ణయం తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తోంది. 6 నుంచి 8వ తరగతి వరకూ వేరే విధంగా చదివినవారు ఇప్పుడు హఠాత్తుగా సంస్కృతమో, హిందీయో నేర్చుకుతీరాలి. అసలు పాఠ్యపుస్తకాలే లేని ప్రస్తుత స్థితిలో, కీలక మలుపు అనదగిన పదో తరగతినాటికి పిల్లలంతా ఆ భాషల్లో ప్రావీణ్యత సాధించటం సాధ్యమేనా? ఇప్పటికే ఒక యూనిట్ టెస్ట్ కూడా పూర్తయింది. 'ప్రస్తుతానికి' తొమ్మిదో తరగతివారికి ఆరో తరగతి పాఠ్యపుస్తకం వినియోగించాలనీ, టీచర్లుండరు గనుక రిటైరైనవారి సేవలను వినియోగించుకోవాలనీ సీబీఎస్ఈ చెబుతోంది. 'ఎలా రాసినా...' ఆ మార్కుల్ని పట్టించుకోబోమన్న సన్నాయి నొక్కులు అదనం. కానీ అన్నిటా 90 శాతంపైగా సాధించిన విద్యార్థి మార్కుల జాబితాలో ఇదొక దిష్టిచుక్కగా మిగలదా? సీబీఎస్ఈ ఇంతకూ ఏం సాధించదల్చుకుంది? ఇప్పటికైనా తెలివి తెచ్చుకుని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

# మోసకారితనం!

రైతే దేశానికి వెన్నెముక అని ఘనంగా ప్రసంగాలు దంచే మోడీ ప్రభుత్వం, ఆచరణలో అన్నదాతలను అడుగడుగునా ఆశాభంగానికి గురిచేస్తోంది. పెట్టుబడులు, ఎరువుల ధరలు ఏటేటా 20 -- 30 శాతానికి పైబడి పెరిగిపోతుంటే, కనీస మద్దతు ధరల ప్రకటన మాత్రం ఇంకా అరకొరగానే అఘోరిస్తోంది. బుధవారం నాడు కేంద్ర ప్రభుత్వం 13 రకాల పంటలకు ప్రకటించిన మద్దతు ధరలు కంటితుడుపు చర్య కన్నా అధ్వానం. వాస్తవ పరిస్థితుల పట్టింపు లేకుండానే ఏదో తూతూమంత్రపు తంతుగా ఉంది. రెండు వారాల క్రితం ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిన లెక్కలు తాజాగానే ఉన్నాయి. ఆ భారాన్ని తట్టుకునే స్థాయిలోనైనా పంటలకు కనీస మద్దతు లేకపోవటం రైతుల పట్ల పాలకుల నిర్లక్ష్యాన్ని, నిర్వూచీతనాన్ని తేటతెల్లం చేస్తోంది. 2026-27 సీజనుకు గానూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు క్షేత్రస్థాయి పరిశీలనను గానీ, రైతు సంఘాల విజ్ఞప్తులను గానీ కొంతమాత్రంగానైనా ప్రతిబింబించటం లేదు. గతేడాదితో పోలిస్తే ఎరువులు, పురుగుల మందుల ధరలు 30 శాతం దాకా పెరిగాయి. ట్రాక్టరు, ఇతర యంత్ర ఉపకరణాల నిర్వహణ వ్యయం, అద్దెలూ పెరిగాయి. త్వరలో డీజిలు ధర పెరగనుందన్న వార్తలు వస్తూనే ఉన్నాయి. అమెరికా సృష్టించిన యుద్ధ బీభత్సం ఇప్పటికే ఎరువులు, ఇతర సామగ్రి ప్రియం అయిపోవటానికి కారణమైంది. ఎల్ నినో పరిస్థితులు ఏర్పడి, ఈ ఏడాది వర్షపాతం తగిన స్థాయిలో ఉండకపోవొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో రైతాంగం పట్ల ప్రేమ ఉన్న ఏ ప్రభుత్వమైనా ఏం చేయాలి? దేశంలో 60 శాతం గ్రామీణ ప్రాంతానికి ఆదరువుగా నిలుస్తున్న వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలవాలి. రైతుకు భరోసా ఇచ్చే సహాయ సహకారాల ప్రణాళికతో ముందుకు రావాలి. కానీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ రైతులను మార్కెట్టుకు, పరిస్థితులకు వదిలేసి, చోద్యం చూస్తున్నాయి. కాబట్టే, ఇప్పటికే యుద్ధం కారణంగా నెలకొన్న పరిస్థితులకు వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోయి, మన రైతులు దారుణంగా నష్టపోయారు. దానికి ముందు అమెరికా విధించిన టారిఫ్‌లకూ అన్నదాతలు బలయ్యారు. అప్పుడూ, ఇప్పుడూ మోడీ



ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తోంది తప్ప, రైతులను ఆదుకునే ఆచరణకు పూనుకోలేదు. అలాంటి స్పృహ కొంత ఉన్నా, క్వింటా ధాన్యానికి గతేడాది కన్నా రూ.72లు మాత్రమే పెంచి, చేతులు దులుపుకొని ఉండేది కాదు. మొక్కజొన్నకు రూ.10 లు, పెసలుకు రూ.12 లు మాత్రమే విదిల్చి ఉండేది కాదు. కొన్ని పంటల ధరలు వందల్లో పెంపు కనిపిస్తున్నా, పెరిగిన ఖర్చుతో పోలిస్తే మద్దతు అనేది ప్రహసనంగానే అనిపిస్తోంది. నిజానికి ఆహార పంటల సాగు చాలా కాలంగా సంక్షోభంలో ఉంది. స్వామినాథన్ కమిషన్ సూచించిన మద్దతు ధర ఫార్ములా సి2 ప్లస్ 50 శాతం అనేది అమలు చేస్తే కొంతలో కొంత ఊరట. రైతు వివిధ రూపాల్లో పెట్టిన పెట్టుబడిని, ఇంటిల్లిపాది శ్రమను సాగు వ్యయంగా లెక్కించి, దానికి 50 శాతం జోడించి- పంట ధర నిర్ణయించాలనేది ఈ ఫార్ములా సారాంశం! పాలకులు దీనిని పట్టించుకోకపోగా, సాగు భారాన్ని మరింత పెంచే చర్యలు చేపడుతున్నారు. గతేడాది మోడీ ప్రభుత్వం ఎరువుల సబ్సిడీకి బడ్జెట్లో కేటాయించిందే తక్కువ అనుకుంటే, ఆ తరువాత 16 వేల కోట్ల మేర నిధులకు కోత పెట్టింది. అలాగే, మద్దతు ధరల అమలుపై ఎలాంటి పర్యవేక్షణా చేపట్టకుండా మార్కెట్ శక్తుల ఇష్టానుసారానికి వదిలేస్తోంది. లోపభూయిష్టమైన, నిర్లక్ష్యపూరితమైన ఈ బాధ్యతారాహిత్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ స్వస్తి పలకాలి. అభివృద్ధి చెందిన దేశాలు వ్యవసాయోత్పత్తులకు పెద్దఎత్తున రాయితీలు, ప్రోత్సాహకాలు ఇచ్చి ముందుకు సాగుతుంటే, భారత రైతాంగానికి భారాల ముకుతాడు వేయటం దారుణం. దేశ సౌభాగ్యానికి, ఆరోగ్యానికి రైతు ఒక కీలకమైన పాత్రధారి అని గుర్తించి, వ్యవసాయ రంగాన్ని బలంగా నిలబెట్టటానికి చిత్తశుద్ధితో వ్యవహరించాలి. గట్టి చేతలు లేని ప్రతి వట్టి మాటా మోసకారితనంగానే మిగులుతుంది!

# లోపభూయిష్టం 'సర్'

దేశంలో వివాదాస్పదమై ఇంకా సుప్రీం కోర్టు ముందున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియను ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మరో 16 రాష్ట్రాల్లో, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో చేపడతామన్న భారత ఎన్నికల సంఘం ప్రకటన ఆందోళన కలిగిస్తోంది. ఎస్ ఐ ఆర్ మూలంగా పశ్చిమ బెంగాల్ లో 90 లక్షల మంది ఓట్లు తొలగించారు. ఆ రాష్ట్ర ఎన్నికలపై ఎస్ ఐ ఆర్ ప్రభావం మెండుగా ఉందని లోకం కోడై కూసింది. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ జరిగిన 105 సీట్లలో బిజెపి గెలవగా వాటిలో 35 సీట్లలో ఎస్ ఐ ఆర్ తొలగించిన ఓట్ల కన్నా తక్కువ మార్జిన్ తో బిజెపి గెలిచింది. ఇప్పుడా సీట్లలో ఓడిన అభ్యర్థులు కోర్టులో కేసులు దాఖలు చేస్తున్నారని వార్తలొస్తున్నాయి. ఓటర్ల జాబితా అక్రమాల్లో ఎస్ ఐ ఆర్ ను కారణంగా చూపితే ఆ కేసుల్ని విచారిస్తామని గతంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తే ప్రకటించియున్నారు కూడా! ఎస్ ఐ ఆర్ అమలులో లోపాలున్నాయన్న విషయం బహిరంగ రహస్యం. సాక్షాత్తు సుప్రీంకోర్టు బెంగాల్ లో ఎస్ ఐ ఆర్ ట్రిబ్యునళ్లకు విచారణాధికారులుగా న్యాయాధికారులను నియమించింది. అంతకు ముందు ఎస్ ఐ ఆర్ అమలు చేసిన బీహార్, తమిళనాడు, కేరళం తదితర రాష్ట్రాల్లోనూ అక్రమాలు జరిగాయి. అటువంటి ఎస్ ఐ ఆర్ ను ఇప్పుడు మూడవ దశ పేరిట అమలుకు పూనుకోవడం దారుణం. అంతేగాక బెంగాల్ ఎన్నికల ప్రక్రియ ఎంతో లోపభూయిష్టంగా జరిగిందన్నది నగ్న సత్యం. ఆ రాష్ట్ర సి ఈ ఓ గా పని చేసిన పెద్దమనిషి బిజెపి అధికారానికి వచ్చాక అమాంతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కావడం అందుకో తార్కాణం. అసలు ఈ ఎస్ ఐ ఆర్ ను ముందుకు తెచ్చిన ప్రస్తుత ఎన్నికల ప్రధాన కమిషనర్ పార్లమెంటులో అభిశంసనను సైతం ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ఏ విధంగా చూసినా ఎస్ ఐ ఆర్ ఒక వివక్షా పూర్వక ప్రక్రియ. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ కీలకమైనది.

ఎన్నికలకు ప్రాతిపదిక ఓటరు జాబితా. అది లోపరహితంగా ఉంటేనే ఎన్నిక సక్రమం అవుతుంది. అలాగే ఎన్నికల నిర్వాహకులు




నిరపేక్షంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. కానీ బిజెపి అధికారానికి వచ్చాక మిగతా రాజ్యాంగ వ్యవస్థల మాదిరిగా ఎన్నికల కమిషన్ ను కూడా తమ పరివారంతో నింపేసుకున్నారు. ఆ క్రమంలోనే సిఈసి నియామకం కూడా! అసలు నియామక ప్రక్రియలోనే తిరకాసు ఉంది. గురువారం నాడు జరిగిన విచారణలో సాక్షాత్తూ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యల్లోనూ అది దాగుంది. ప్రధాని అధ్యక్షతన గల ఎంపిక కమిటీలో తటస్థులు ఒక్కరైనా లేరన్న నగ్న సత్యాన్ని ఆయన ప్రస్తావించారు. దానికి సమాధానం ఇవ్వాల్సిన అటార్నీ జనరల్ సుప్రీం కోర్టు మరో పార్లమెంటు ఛాంబర్ కాలేదని అడ్డగోలు వాదనలు చేయడం విస్తుగొలుపుతోంది. మొదటి రెండు రౌండ్లలో తీవ్ర అవకతవకలు జరిగిన ఎస్ ఐ ఆర్ అమలును వెంటనే ఉపసంహరించాలి. ఇప్పటికే పలు ఆరోపణల్లో చిక్కుకొని సుప్రీం కోర్టు ఎదుట కేసు, పార్లమెంటు ముందు అభిశంసన పెండింగ్ లో ఉన్న సి ఈ సి కి మూడవ దశ ఎస్ ఐ ఆర్ ప్రకటించే నైతిక అధికారం కూడా లేదన్న పరిశీలకుల వ్యాఖ్యల్ని ఎవరూ కొట్టి పారెయ్యలేరు. ఇతర రాష్ట్రాలన్నిటి ఎస్ ఐ ఆర్ అమలు అనుభవమూ అవకతవకల మయమే కనుక తెలుగు రాష్ట్రాల్లో దాని అమలును నిలిపివేయాలి. బిజెపి యేతర రాజకీయ పార్టీలు ఈ లోపభూయిష్ట విధానాన్ని ప్రతిఘటించాలి. ప్రజాస్వామ్యానికి మూలమైన ఎన్నికల ప్రక్రియను తొత్తడం చేసే ఎస్ ఐ ఆర్ ను ప్రజలు వ్యతిరేకించాలి. ఆ దిశగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలి.

## పప్పు దినుసులను తిన్న తరువాత జీర్ణ సమస్యలు వస్తున్నాయా..
# అయితే వాటిని ఇలా తీసుకోండి..



పప్పులు భారతీయ ఆహారంలో కీలక భాగంగా ఉంటాయి. ఇవి ప్రోటీన్, ఫైబర్, అవసరమైన పోషకాలతో నిండి ఉండడంతో రోజువారీ భోజనంలో ఎక్కువగా వాడుతుంటారు. అయితే పప్పులు తిన్న తర్వాత కొందరికి పొట్ట ఉబ్బరం, బరువుగా అనిపించడం, గ్యాస్ వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. అయితే దీనికి పప్పులు కారణం కాకపోవచ్చని, వాటిని సరైన విధంగా సిద్ధం చేయకపోవడమే ప్రధాన కారణమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పప్పులు వండే ముందు నానబెట్టడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. అయితే అన్ని రకాల పప్పులకు ఒకే విధమైన నానబెట్టే సమయం సరిపోదని చెబుతున్నారు. ఏ పప్పును ఎంతసేపు నానబెట్టాలో తెలుసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు పొట్ట ఉబ్బరం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉందని వివరిస్తున్నారు.

### రాత్రంతా నానబెట్టడం మంచిది..

చిన్న పరిమాణంలో ఉండే పూర్తి గింజల పప్పులు ఇతర పెద్ద లెగ్యూమ్స్‌తో పోలిస్తే తేలికగా జీర్ణమవుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని సుమారు 7 నుంచి 8 గంటలు, ముఖ్యంగా రాత్రంతా కొద్దిగా ఉప్పు వేసి నానబెట్టడం మంచిదని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల పప్పులు మెత్తబడటంతో పాటు వండటానికి సులభమవుతాయి. జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుందని చెబుతున్నారు. అలాగే రాజ్మా, శనగలు, చోలే వంటి పెద్ద లెగ్యూమ్స్‌కు మరింత సమయం అవసరమని చెబుతున్నారు. వీటి పై పొర గట్టిగా ఉండటంతో జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అందువల్ల ఇవి గ్యాస్, పొట్ట ఉబ్బరం వంటి సమస్యలకు కారణమవుతాయని వివరిస్తున్నారు. కనీసం 10 నుంచి 12 గంటల పాటు రాత్రంతా నానబెట్టాలని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల జీర్ణానికి ఇబ్బంది కలిగించే కొన్ని సంయోగాలు తగ్గిపోతాయని అంటున్నారు.

### పొట్టు తీస్తే ఎక్కువ సేపు అవసరం లేదు..

అలాగే పొట్టు తీసిన రకాలైన కందిపప్పు, మినప పప్పు వంటి వాటికి ఎక్కువసేపు నానబెట్టాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. వీటిలో బయటి పొర లేకపోవడంతో ఇవి తేలికగా జీర్ణమవుతాయని పేర్కొంటున్నారు. సుమారు 4 నుంచి 5 గంటలు నానబెట్టడం సరిపోతుందని సూచిస్తున్నారు. పప్పులు నానబెట్టడం ఒక ఎంపిక కాదు, తప్పనిసరి అలవాటు కావాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడటంతో పాటు గట్ ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలియజేస్తున్నారు. ఈ చిన్న అలవాటు వల్ల పొట్ట ఉబ్బరం తగ్గడం, పోషకాలు శరీరానికి మెరుగ్గా అందడం, భోజనం తిన్న తర్వాత తేలికగా అనిపించడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని సూచిస్తున్నారు. పప్పులు తిన్నప్పుడు జీర్ణ సమస్యలు వస్తున్నాయని భావించే వారు ముందుగా వాటిని నానబెట్టే విధానాన్ని పరిశీలించుకోవాలని చెబుతున్నారు.

# ప్రీడయాబెటిస్ ఉన్నవారికి విటమిన్ డి ఇస్తే మెరుగైన ఫలితాలు..




ప్రస్తుత కాలంలో భారతదేశంలో ప్రీడయాబెటిస్ సమస్య వేగంగా పెరుగుతోంది. ఐసీఎంఆర్-ఇండియాబ్ అధ్యయనం ప్రకారం దేశ జనాభాలో సుమారు 15.3 శాతం మంది ప్రీడయాబెటిస్‌తో బాధపడుతున్నారు. ఇది దాదాపు 13.6 కోట్ల మందికి సమానం. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఈ పరిస్థితి టైప్-2 డయాబెటిస్‌గా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిక మోతాదులో విటమిన్-డి సప్లిమెంట్లు కొంతమందిలో డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తాయని తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ పరిశోధనను అమెరికాలోని టఫ్ట్స్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించారు. అధ్యయన ఫలితాలు జామా నెట్‌వర్క్ ఓపెన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

### రోజుకు ఎంత మోతాదులో ఇస్తే..

పరిశోధకులు ముందుగా నిర్వహించిన డి2డి ట్రయల్ డేటాను మళ్లీ విశ్లేషించారు. ఇందులో పాల్గొన్న పెద్దలకి రోజుకు 4,000 ఐయూ విటమిన్-డి లేదా ప్లాసీబోను సుమారు రెండున్నరేళ్ల పాటు ఇచ్చారు. మొదటి దశలో జరిగిన డి2డి అధ్యయనంలో పాల్గొన్నవారిలో డయాబెటిస్ ప్రమాదం తగ్గినట్టు స్పష్టమైన ఫలితాలు కనిపించలేదు. అయితే తాజా విశ్లేషణలో కొన్ని ప్రత్యేక జన్యు లక్షణాలు ఉన్నవారికి విటమిన్-డి వల్ల ప్రయోజనం కలిగినట్టు గుర్తించారు. ఈ పరిశోధనలో భాగంగా 2,098 మంది పాల్గొన్నవారి డీఎన్ఏ నమూనాలను పరీక్షించారు. ముఖ్యంగా విటమిన్-డి రిసెప్టర్ (వీడీఆర్) జీన్లలో ఉండే మూడు సాధారణ వేరియంట్లను పరిశీలించారు. రక్త పరీక్షల ద్వారా ఫాస్టింగ్ గ్లూకోజ్ 126 ఎంజీ/డీఎల్ కంటే ఎక్కువగా ఉండటం, రెండు గంటల తర్వాత గ్లూకోజ్ 200 ఎంజీ/డీఎల్ దాటడం లేదా హెచ్‌బీఏ1సీ 6.5 శాతానికి మించితే డయాబెటిస్‌గా నిర్ధారించారు. అధ్యయనం ప్రకారం వీడీఆర్ జీన్‌లో ఏపాల్ ప్రాంతంలో ఏసీ లేదా సీసీ రకాల వేరియంట్లు ఉన్నవారిలో విటమిన్-డి సప్లిమెంట్లు తీసుకున్నప్పుడు డయాబెటిస్ ప్రమాదం సుమారు 19 శాతం వరకు తగ్గినట్టు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 శాతం మందిలో ఈ వేరియంట్లు ఉండే అవకాశముందని పరిశోధకులు చెబుతున్నారు.

### అందరికీ వర్తించదు..

అయితే ఏఏ వేరియంట్ ఉన్నవారిలో మాత్రం ఈ ప్రయోజనం కనిపించలేదని వెల్లడించారు. విటమిన్-డి శరీరంలో ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్యాంక్రియాస్‌లో ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాల్లో విటమిన్-డి రిసెప్టర్ ప్రోటీన్లు ఉంటాయి. ఇవి యాక్టివ్ విటమిన్-డితో కలిసి పనిచేస్తాయి. అయితే జీన్‌లలో ఉండే మార్పుల వల్ల ఈ ప్రక్రియ ప్రభావితం అవుతుందని పరిశోధకులు వివరిస్తున్నారు. అధ్యయనంలో ఉపయోగించిన 4,000 ఐయూ విటమిన్-డి మోతాదు సాధారణంగా సూచించే రోజువారీ 600 నుంచి 800 ఐయూ కంటే చాలా ఎక్కువ. అయినప్పటికీ ట్రయల్ సమయంలో తీవ్రమైన దుష్ప్రభావాలు కనిపించలేదని పరిశోధకులు పేర్కొన్నారు.

### వైద్యుల సలహా లేకుండా వద్దు..

అయితే వైద్యుల సలహా లేకుండా అధిక మోతాదులో విటమిన్-డి ని తీసుకోవద్దని హెచ్చరిస్తున్నారు. అధికంగా తీసుకుంటే విటమిన్-డి టాక్సిసిటీ ప్రమాదం ఉంటుందని సూచిస్తున్నారు. భవిష్యత్తులో ప్రీడయాబెటిస్ ఉన్నవారిలో ఎవరికి విటమిన్-డి సప్లిమెంట్లు ఎక్కువ ప్రయోజనం ఇస్తాయో జన్యు పరీక్షల ద్వారా ముందుగానే గుర్తించే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. ఇది వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్సలు అందించే పర్సనలైజ్డ్ మెడిసిన్ దిశగా ఒక ముందడుగుగా భావిస్తున్నారు. అయితే నిపుణులు జీవనశైలినే అత్యంత కీలక అంశంగా పేర్కొంటున్నారు. సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, యోగా, బరువు నియంత్రణ వంటి అలవాట్లు డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు. విటమిన్-డి సప్లిమెంట్లు కొన్ని జన్యు లక్షణాలు ఉన్నవారికి అదనపు రక్షణగా ఉపయోగపడే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

# కేక్‌ల మీద వాడే క్రీమ్ డెయిరీనా, నాన్-డెయిరీనా అని తెలుసుకోవడం ఎలా.. ఇలా చేస్తే చాలు..

పిల్లలతో పాటు పెద్దలు కూడా ఇష్టంగా తినే వాటిల్లో కేక్ ఒకటి. ప్రతి శుభకార్యంలో ఇప్పుడు కేక్ కట్టింగ్ తప్పనిసరైందని చెప్పవచ్చు. అయితే కేక్‌పై ఉండే క్రీమ్ నిజమైన డెయిరీ క్రీమా, లేక నాన్-డెయిరీ క్రీమా అనే సందేహం చాలా మందికి వస్తుంటుంది. బయటకు చూస్తే రెండూ ఒకేలా కనిపించినా, రుచి, టెక్స్చర్, తయారీ విధానం పరంగా ఇవి పూర్తిగా భిన్నమని ఫుడ్ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా భారతీయ బేకరీల్లో ఎక్కువగా ఉపయోగించే నాన్-డెయిరీ క్రీమ్ గురించి తెలుసుకోవడం వినియోగదారులకు ఉపయోగకరమని సూచిస్తున్నారు. సాధారణంగా విప్డ్ డెయిరీ క్రీమ్ ఆవు పాలతో తయారవుతుంది. ఇందులో కనీసం 30 శాతం వరకు పాల కొవ్వు ఉంటుంది. ఈ ఫ్యాట్ కారణంగానే క్రీమ్‌కు మృదువైన టెక్స్చర్, క్రీమీ ఫీలింగ్ వస్తాయి. విప్ చేసినప్పుడు గాలిని పట్టుకుని లైట్‌గా, ఫ్లఫీగా మారుతుంది. బ్రాండెడ్ బేకరీల్లో కనిపించే సాఫ్ట్ క్రీమ్ కేక్‌లలో సాధారణంగా ఇలాంటి డెయిరీ క్రీమ్ ఉపయోగిస్తారు.



### తేడా ఏమిటి..

మరోవైపు నాన్-డెయిరీ క్రీమ్ పూర్తిగా వేరే ఉత్పత్తి. ఇది సాధారణంగా నీరు, హైడ్రోజనేటెడ్ వెజిటబుల్ ఆయిల్, కార్న్ సిరప్, స్టెబిలైజర్స్, ఎమల్సిఫైయర్స్ వంటి పదార్థాలతో తయారవుతుంది. ఇది డెయిరీ క్రీమ్‌లా కనిపించేందుకు ప్రత్యేకంగా తయారు చేస్తారు. అయితే ఇది సహజ పాల ఉత్పత్తి కాదని నిపుణులు వివరిస్తున్నారు. దేశంలో ఎక్కువ బేకరీలు నాన్-డెయిరీ క్రీమ్‌ను ఉపయోగించడానికి ప్రధాన కారణం వాతావరణమే. అధిక ఉష్ణోగ్రతల్లో డెయిరీ క్రీమ్ త్వరగా కరుగుతుంది. కానీ నాన్-డెయిరీ క్రీమ్ ఎక్కువసేపు ఆకారాన్ని నిలుపుకుంటుంది. కేక్ డెకరేషన్స్, డిజైన్స్ కూడా స్పష్టంగా కనిపిస్తాయి. డెలివరీ సమయంలో కూడా ఇది సులభంగా చెడిపోదు. కేక్‌పై ఉన్న క్రీమ్ ఏ రకమో కొన్ని లక్షణాల ద్వారా గుర్తించవచ్చని చెబుతున్నారు. డెయిరీ క్రీమ్ సాధారణంగా తేలికగా, మైల్డ్ స్వీట్‌గా ఉంటుంది. నోట్లో వేసుకున్న వెంటనే కరిగిపోతూ పాల రుచిని ఇస్తుంది. తిన్న తర్వాత ఆయిలీ ఫీలింగ్ ఉండదు. అదే నాన్-డెయిరీ క్రీమ్ అయితే ఎక్కువ తీపిగా ఉండటంతోపాటు కొంచెం ఆర్టిఫిషియల్ రుచి వస్తుంది. కొందరికి ఇది మైనం లాంటి లేదా ఆయిలీ ఫీలింగ్ ఇస్తుంది. తిన్న తర్వాత నాలుకపై కొద్దిసేపు కొవ్వు పొర ఉన్నట్టుగా అనిపిస్తుంది.

### రూపాన్ని చూసి చెప్పవచ్చు..

క్రీమ్ రూపాన్ని చూసి కూడా కొంతవరకు అంచనా వేయొచ్చని చెబుతున్నారు. డెయిరీ క్రీమ్ కొంచెం మ్యాట్ ఫినిష్‌లో కనిపిస్తుంది. పైపింగ్ డిజైన్లు సాఫ్ట్‌గా ఉంటాయి. నాన్-డెయిరీ క్రీమ్ మాత్రం ఎక్కువ గ్లోసీగా, ప్లాస్టిక్ లుక్‌తో కనిపిస్తుంది. కేక్‌పై డిజైన్లు కూడా చాలా షార్ప్‌గా, గట్టిగా కనిపిస్తాయి. చేతికి తగిలినప్పుడు కూడా తేడా తెలుస్తుంది. డెయిరీ క్రీమ్ శరీర వేడితో త్వరగా కరుగుతుంది. నాన్-డెయిరీ క్రీమ్ మాత్రం కొంత గట్టిగా, మైనంలా ఉండి త్వరగా కరగదు. ప్యాకేజ్డ్ కేక్‌లలో అయితే ఇన్‌గ్రిడియెంట్స్ లిస్ట్ చూసి తెలుసుకోవచ్చు. క్రీమ్, డెయిరీ క్రీమ్ వంటి పదాలు ఉంటే అది పాల ఆధారిత క్రీమ్ అయ్యే అవకాశం ఉంది. వెజిటబుల్ ఫ్యాట్, నాన్-డెయిరీ టాపింగ్, పామ్ ఆయిల్, స్టెబిలైజర్స్ వంటి పదాలు ఉంటే అది నాన్-డెయిరీ క్రీమ్ అయ్యే అవకాశాలు ఉంటాయి. అయితే ఈ రెండింటిలో ఏదీ పూర్తిగా చెడు కాదు అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. డెయిరీ క్రీమ్ సహజమైన రుచి ఇస్తే, నాన్-డెయిరీ క్రీమ్ ఎక్కువ స్థిరత్వం కలిగి ఉంటుంది. ముఖ్యంగా లాక్టోజ్ అసహనం ఉన్నవారికి లేదా వెగన్ ఆహారం తీసుకునేవారికి నాన్-డెయిరీ క్రీమ్ ఉపయోగకరంగా ఉంటుంది. కేక్ కొనేటప్పుడు ఫ్రెష్ క్రీమ్ అంటే నిజంగా ఏ క్రీమ్ వాడుతున్నారో బేకరీని నేరుగా అడగడం మంచిది. రుచి, టెక్స్చర్, రూపం, లేబుల్ వంటి విషయాలను గమనిస్తే డెయిరీ, నాన్-డెయిరీ క్రీమ్‌ల మధ్య తేడాను సులభంగా గుర్తించవచ్చు.

## హార్మోన్ల సమస్యలు ఉన్న మహిళలు పాటించాల్సిన జాగ్రత్తలు,
# తీసుకోవాల్సిన ఆహారాలు ఇవే..!



నేటి తరుణంలో హార్మోన్ల అసమతుల్యతతో బాధపడే మహిళల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. మారిన జీవన విధానం,ఆహారపు అలవాట్లే ఈ సమస్యకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. అయితే హార్మోన్ల అసమతుల్యత సమస్యలు ఎదుర్కొంటున్న చాలా మంది మహిళలు నేరుగా సప్లిమెంట్స్ లేదా హార్మోన్ బ్యాలెన్సింగ్ ఉత్పత్తులవైపు వెళ్లిపోతుంటారు. శరీరం ముందుగా సిద్ధంగా లేకపోతే అలాంటి ప్రయత్నాలు ప్రయోజనం ఇవ్వకపోగా సమస్యలను మరింత పెంచే అవకాశం ఉందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈస్ట్రోజెన్ అధిక స్థాయిలకు సంబంధించిన లక్షణాలను తగ్గించాలంటే ముందుగా కాలేయం (లివర్) పనితీరును మెరుగుపరచడం చాలా అవసరమని వారు సూచిస్తున్నారు. శరీరంలో ఈస్ట్రోజెన్‌ను ప్రాసెస్ చేసి బయటకు పంపే ప్రధాన బాధ్యత లివర్‌దే. మొదట లివర్ ఈస్ట్రోజెన్‌ను విచ్ఛిన్నం చేస్తుంది. తరువాత దానిని శరీరం నుంచి బయటకు వెళ్లేలా ప్యాక్ చేస్తుంది. ఈ ప్రక్రియ మందగిస్తే ఈస్ట్రోజెన్ పూర్తిగా బయటకు వెళ్లకుండా మళ్లీ శరీరంలోనే తిరుగుతుందని, దీనినే ఈస్ట్రోజెన్ డామినెన్స్ అంటారని నిపుణులు వివరిస్తున్నారు.

### ఫైబర్ సమృద్ధిగా అవసరం..

ఈ పరిస్థితిని సరిచేయడానికి ముందుగా గట్ హెల్త్‌పై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. రోజుకు 25 నుంచి 35 గ్రాముల ఫైబర్ తీసుకోవడం ద్వారా జీర్ణవ్యవస్థను మెరుగుపరచవచ్చని చెబుతున్నారు. ఇందుకు అరటి పండ్లు, మునగ ఆకులు, మెంతులు, అవిసె గింజలు వంటి ఆహారాలు ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు. అయితే శరీరం ఎంతవరకు ఫైబర్‌ను తట్టుకోగలదో దాన్ని బట్టి మోతాదును నిర్ణయించుకోవాలని సూచిస్తున్నారు. అలాగే పెరుగు, కాంజీ, ఇంట్లో తయారుచేసిన పచ్చళ్ళ వంటి ఫెర్మెంటెడ్ ఫుడ్స్ కూడా గట్ ఆరోగ్యానికి మేలు చేస్తాయని చెబుతున్నారు. గట్ ఆరోగ్యం మెరుగైన తర్వాత లివర్‌కు అవసరమైన పోషకాలను అందించడం ముఖ్యం. గుడ్లు, షిటాకే మష్రూమ్స్‌లో ఉండే కొలిన్ లివర్ పనితీరుకు సహాయపడుతుంది. ఉల్లిపాయ, వెల్లుల్లిలో ఉండే సల్ఫర్ సమ్మేళనాలు డిటాక్సిఫికేషన్ ప్రక్రియకు మద్దతిస్తాయి. ఆకుకూరలు, ఉడికించిన పప్పుల్లో ఉండే సహజ ఫోలేట్ కూడా ఉపయోగకరమని పేర్కొంటున్నారు. సన్‌ఫ్లవర్ గింజల్లో ఉండే విటమిన్ బి6 కూడా హార్మోన్ల సమతుల్యతకు తోడ్పడుతుందని చెబుతున్నారు.

### ఈస్ట్రోజెన్ ను మళ్లీ శోషించకూడదు..

అంతేకాకుండా శరీరంలో ఈస్ట్రోజెన్ మళ్లీ శోషించబడకుండా అడ్డుకోవడం కూడా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. నారింజ, యాపిల్ వంటి పండ్లలో ఉండే గ్లూకారిక్ యాసిడ్ ఈ ప్రక్రియలో సహాయపడుతుందని వెల్లడిస్తున్నారు. ఇది గట్‌లో ఉండే కొన్ని ఎంజైమ్స్‌ను అడ్డుకొని ఈస్ట్రోజెన్ మళ్లీ శరీరంలోకి వెళ్లకుండా సహాయపడుతుందని వివరిస్తున్నారు. ఇక ఈ అన్ని దశలను పాటించిన తరువాతే డిఐఎం సప్లిమెంట్స్ గురించి ఆలోచించాలని సూచిస్తున్నారు. డిఐఎం అనేది బ్రోకోలీ, కాలీఫ్లవర్, బ్రస్సెల్స్ స్ప్రౌట్స్ వంటి క్రూసిఫెరస్ కూరగాయల్లో ఉండే సంయోగం నుంచి ఉత్పత్తి అయ్యే పదార్థం. ఇది ఈస్ట్రోజెన్‌ను సురక్షిత మార్గంలో విచ్ఛిన్నం చేయడంలో సహాయపడుతుంది. అయితే గట్, లివర్, ఎలిమినేషన్ వ్యవస్థ సరిగా పనిచేయకముందే డిఐఎం తీసుకుంటే శరీరంలో ఇప్పటికే ఉన్న బ్లాకేజ్ మరింత పెరిగి లక్షణాలు తీవ్రమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

### డిఐఎం సప్లిమెంట్స్‌ను ఇలా తీసుకోవాలి..

అలాగే అవసరమైతే రోజుకు 1000 మిల్లీగ్రాముల డిఐఎంను కొవ్వు ఉన్న ఆహారంతో తీసుకోవచ్చని చెబుతున్నారు. అయితే అది కూడా శరీరం సిద్ధంగా ఉన్నప్పుడు మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు. అప్పటికీ సమస్యలు కొనసాగితే హార్మోన్ మెటబాలిజం ఏ దశలో ఇబ్బంది పడుతోందో తెలుసుకోవడానికి ప్రత్యేక పరీక్షలు చేయించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే చాలా మందికి ఆ దశ అవసరం ఉండదని, ముందుగా గట్, లివర్ ఆరోగ్యం మెరుగుపడితేనే ఈస్ట్రోజెన్ సంబంధిత సమస్యల్లో మంచి మార్పు కనిపిస్తుందని వివరిస్తున్నారు. మలబద్ధకం ఉన్నవారిలో ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరం నుంచి వ్యర్థాలు సక్రమంగా బయటకు వెళ్లకపోతే హార్మోన్ అసమతుల్యత ఎక్కువ కాలం కొనసాగవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## వేసవిలో పెరుగు, మజ్జిగను తీసుకుంటున్నారా..
# ఈ ముఖ్యమైన విషయాలను తెలుసుకోవాల్సిందే..





వేసవికాలంలో జీర్ణక్రియకు సంబంధించిన సమస్యలు చాలామందిని ఇబ్బంది పెడుతుంటాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఆకలి తగ్గడం, ఆమ్లత్వం పెరగడం, ఆహారం ఆలస్యంగా జీర్ణం కావడం వంటి సమస్యలు కనిపిస్తాయి. ఇలాంటి సమయంలో పెరుగు, మజ్జిగ వంటి సంప్రదాయ ఆహారాలు మళ్లీ ప్రాధాన్యం పొందుతున్నాయి. వేసవి కాలంలో చాలా మంది వీటిని ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. ఇవి రెండూ శరీరాన్ని చల్లగా ఉంచడమే కాకుండా పేగు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే వేసవిలో పొట్టకు ఏది తేలికగా ఉంటుందనే విషయంలో చాలామందికి సందేహం ఉంటుంది. వేసవిలో అధిక వేడి కారణంగా శరీరంలోని మెటబాలిజం మందగిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జీర్ణక్రియకు అవసరమైన గ్యాస్ట్రిక్ ఎంజైమ్స్ పనితీరు తగ్గడంతో ఆహారం సరిగా జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. శరీరంలో నీటి కొరత కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే పేగుల్లో మంచి బ్యాక్టీరియా పెంచే ఫెర్మెంటెడ్ ఆహారాలను వేసవిలో ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

### పేగుల ఆరోగ్యానికి..

పెరుగును పాలలో లాక్టిక్ యాసిడ్ బ్యాక్టీరియా కలిపి తయారు చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల ప్రోబయోటిక్స్ ఏర్పడి పేగు మైక్రోబయోమ్‌ను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. పరిశోధనల ప్రకారం పెరుగు వంటి ఫెర్మెంటెడ్ పాల పదార్థాలు జీర్ణక్రియను మెరుగుపరచడంలో, లాక్టోస్ జీర్ణం కావడంలో ఉపయోగపడతాయి. పెరుగులో ప్రోటీన్, కాల్షియం కూడా అధికంగా ఉండటంతో ఇది శరీరానికి పోషకాహారాన్ని అందిస్తుంది. అయితే పెరుగు మందంగా ఉండటంతో కొందరికి వేసవిలో పొట్ట భారంగా అనిపించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఆమ్లత్వం లేదా నెమ్మదైన జీర్ణక్రియ సమస్యలు ఉన్నవారికి ఇది కొంత ఇబ్బంది కలిగిస్తుంది.

### మజ్జిగ సహజ జీర్ణ టానిక్..

ఇక పెరుగును నీటితో పలుచగా చేసి మజ్జిగను తయారు చేస్తారు. ఇందులో జీలకర్ర, అల్లం, పుదీనా వంటి జీర్ణక్రియకు సహాయపడే పదార్థాలను కూడా కలుపుతారు. నీరు ఎక్కువగా ఉండటం వల్ల మజ్జిగ తేలికగా జీర్ణమవుతుంది. అలాగే పెరుగుతో పోలిస్తే కొవ్వు మోతాదు తక్కువగా ఉండటం కూడా దీనికి మరో ప్రయోజనం. ఆయుర్వేదంలో మజ్జిగను సహజ జీర్ణ టానిక్‌గా చెబుతారు. ఇది కడుపు ఉబ్బరం, అసౌకర్యం తగ్గించడంలో సహాయపడుతుంది. భోజనం తర్వాత మజ్జిగను తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు శరీరానికి తేమను అందించడంలో కూడా ఉపయోగపడుతుంది.

### మజ్జిగను మధ్యాహ్నం తీసుకోవాలి..

పెరుగు, మజ్జిగ రెండింటిలోనూ ప్రోబయోటిక్స్ ఉండటంతో పేగు ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే వేసవిలో శరీర వేడి అధికంగా ఉన్నప్పుడు తేలికపాటి ఫెర్మెంటెడ్ పానీయాలు పొట్టపై తక్కువ ఒత్తిడి కలిగిస్తాయి. అందుకే మధ్యాహ్న భోజనం తర్వాత మజ్జిగ తీసుకోవాలి. పోషకాహార నిపుణులు తెలిపిన ప్రకారం బలమైన జీర్ణక్రియ ఉన్నవారు పెరుగును మితంగా తీసుకోవచ్చు. ఇది శరీరానికి శక్తిని అందించడంలో సహాయపడుతుంది. అయితే రోజువారీ హైడ్రేషన్, పొట్టకు తేలికైన జీర్ణక్రియ కోసం మజ్జిగ మంచి ఎంపికగా చెప్పవచ్చు. ముఖ్యంగా కారంగా లేదా భారంగా ఉన్న భోజనం తర్వాత మజ్జిగ తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది.

### పుల్లగా ఉండొద్దు..

అయితే పెరుగు లేదా మజ్జిగ చాలా పుల్లగా మారకుండా తాజాగా తీసుకోవడం ముఖ్యం. అధికంగా పులిసిన పెరుగు, మజ్జిగ వేసవిలో ఆమ్లత్వాన్ని పెంచే అవకాశం ఉంటుంది. ఇంట్లో తాజాగా తయారు చేసిన వాటిని తీసుకుంటే ఆరోగ్యానికి మరింత మేలు జరుగుతుంది. వేసవిలో పొట్టకు తేలికగా జీర్ణమయ్యే ఎంపికగా మజ్జిగను చెప్పవచ్చు. అయినప్పటికీ పెరుగు కూడా సరైన మోతాదులో, సరైన సమయంలో తీసుకుంటే ఆరోగ్యానికి ఉపయోగకరమేనని నిపుణులు చెబుతున్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .